సమగ్ర సమాచార పత్రిక

ముద్ర

www.mudranews.in

హైదరాబాద్
శనివారం, 14.11.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:14 సంచిక: 007
పేజీలు: 08 వెల: రూ. 5

ట్రాఫిక్ కష్టాలకు చెక్

హైదరాబాద్‌లో పాడ్ కార్ల రవాణాకు గ్రీన్ సిగ్నల్!

- మూడు పీఆర్టీఎస్ కారిడార్లు.. రేవంత్ ఆమోదం
- డిసెంబరులో టెండర్ల ప్రక్రియ
- ఏడాదిలో కేపీహెచ్‌బీ–బయోడైవర్సిటీ పాడ్ కార్ల ప్రయాణం!
- హైదరాబాద్‌లో ట్రాఫిక్ టెన్షన్ లేకుండా జర్నీ..

2



2 వేల ఇందిరమ్మ ఇళ్లు!

ఆటో కార్మికులకు గుడ్‌న్యూస్

- రూ.220 కోట్లతో ఆటోనగర్ కాలనీలు..
- నాలుగు చోట్ల నిర్మాణం!
- ఆటో డ్రైవర్ల సొంతింటి కల సాకారం.. సర్కార్ కీలక నిర్ణయం
- బండ్లగూడ నుంచి జల్‌పల్లి వరకు.. ఆటో కార్మికులకు ఇళ్ల టవర్లు
- ఒక్కో ప్రాంతంలో 500 ఫ్లాట్లు..



2

హరీశ్ రావుపై అవినీతి బాంబు

కవిత తీవ్రమైన ఆరోపణలు

- నిమ్స్ రూ.100 కోట్ల అక్రమాలు
- సాగునీటి శాఖలోనూ అవినీతి
- ఎన్.జీఆర్ఐ సిస్మిక్ రిపోర్టు ఎందుకు పక్కకు పెట్టారు?
- సీఎం రేవంత్ రెడ్డికి టీఆర్ఎస్ చీఫ్ కవిత సవాల్
- హరీశ్ రావుపై చర్యలకు డిమాండ్



2

ఘోర ప్రమాదం..

6

కజిరంగా సమీపంలో ఘోర ప్రమాదం.. 23 మంది మృతి

- బస్సు-ట్రక్కు ఢీ.. నుజ్జునుజ్జైన మినీ బస్సు
- అస్సాంలో ఘోర రోడ్డు ప్రమాదం.. మృతుల్లో విద్యార్థులు
- డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమా? 23 మందిని బలిగొన్న ప్రమాదం



పెట్టుబడులకు తెలంగాణ

అనుకూలం

ప్రపంచానికి చాటిచెప్పడమే భారత్ సమ్మిట్ లక్ష్యం



> తెలంగాణలో మౌలిక సదుపాయాలు, మానవ వనరులు, అనువైన వాతావరణం మా బలం
>
> 70 దేశాల నుంచి వెయ్యి మంది ప్రతినిధులకు ఆహ్వానం..
>
> పెట్టుబడుల ఆకర్షణే ప్రధాన ఉద్దేశం
>
> గిగ్ వర్కర్ల కోసం దేశంలోనే అత్యుత్తమ పాలసీ..
>
> రాహుల్ గాంధీకి ఆహ్వానం

ముద్ర, హైదరాబాద్:
తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన పరిస్థితులు ఉన్నాయని ప్రపంచానికి చాటిచెప్పడమే భారత్ సమ్మిట్ ప్రధాన ఉద్దేశమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో మెరుగైన మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అనువైన వాతావరణం పెట్టుబడిదారులకు బలమైన అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026కు ముందస్తుగా ప్రపంచవ్యాప్తంగా తెలంగాణకు గుర్తింపు తీసుకురావడంలో భాగంగానే రెండు రోజుల భారత్ సమ్మిట్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

హైదరాబాద్‌లోని బోధి పెవిలియన్‌లో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకటస్వామి, మహమ్మద్ అజారుద్దీన్, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్, పలువురు ఎంపీలతో కలిసి ముఖ్యమంత్రి మీడియాతో మాట్లాడారు. ఈ సదస్సుకు దాదాపు 70 దేశాల నుంచి వివిధ రంగాలకు చెందిన మంత్రులు, పర్యావరణ వేత్తలు, పెట్టుబడిదారులు, జర్నలిస్టులు సహా సుమారు వెయ్యి మంది ప్రతినిధులను ఆహ్వానించినట్లు తెలిపారు. రెండు రోజులపాటు పర్యావరణం, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, మానవ వనరులు, వాతావరణ మార్పులు తదితర అంశాలపై చర్చలు, సెమినార్లు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రజాస్వామ్యంలో చర్చలు, సంప్రదింపుల ద్వారానే సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయని, వివిధ రంగాల నిపుణుల అభిప్రాయాల ఆధారంగా మెరుగైన విధానాలను అమలు చేస్తామని వివరించారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులు తెలంగాణ గురించి ప్రపంచానికి వివరించే బ్రాండ్ అంబాసిడర్లుగా మారుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

గిగ్ వర్కర్లకు రక్షణ
దేశవ్యాప్తంగా గిగ్ వర్కర్లు, ప్లాట్‌ఫామ్ వర్కర్లు, కొరియర్ సిబ్బంది, డ్రైవర్లు, గృహ కార్మికులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని సీఎం పేర్కొన్నారు. వారికి తగిన సామాజిక భద్రత, రక్షణ కల్పించాలనే ఉద్దేశంతో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే అత్యుత్తమ గిగ్ వర్కర్స్ పాలసీని తీసుకొచ్చిందన్నారు. ఈ పాలసీ అవిష్కరణ కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఆహ్వానించినట్లు వెల్లడించారు. భారత్ సమ్మిట్‌లోనూ రాహుల్ గాంధీ తన సందేశాన్ని వినిపిస్తారని తెలిపారు. గతంలో ప్రధానమంత్రి రాజీవ్ గాంధీ ప్రతిపక్ష నేత అటల్ బిహారీ వాజ్‌పేయిని దేశ ప్రతినిధిగా విదేశాలకు పంపిన సందర్భాన్ని సీఎం గుర్తుచేశారు. ఢిల్లీలో నిర్వహించిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కర్టెన్ రైజర్ కార్యక్రమానికి కేంద్ర మంత్రి పీయూష్ గోయల్‌ను ఆహ్వానించిన విషయాన్ని ప్రస్తావించారు.

దుష్ప్రచారం చేయొద్దు
భారత్ సమ్మిట్‌ను గుడ్డిగా వ్యతిరేకించడం సమర్థనీయం కాదని రేవంత్ రెడ్డి అన్నారు. అర్థరహితమైన ఆరోపణలతో ప్రజలను పక్కదారి పట్టించవద్దని, ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అడ్డుపడొద్దని విజ్ఞప్తి చేశారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పెంచడం, అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ సాంస్కృతిక, సాంకేతిక ప్రగతిని చాటిచెప్పడం ఈ సదస్సుల లక్ష్యమని స్పష్టం చేశారు. భారీగా పెట్టుబడులను ఆకర్షించి అభివృద్ధిని వేగవంతం చేయడమే ప్రభుత్వ సంకల్పమని పేర్కొన్నారు.



రేవంత్‌కు ఇంటర్ సవాల్

55 ఏళ్ల ఇంటర్ బోర్డుకు మంగళం

- 2027–28 నుంచి కొత్త విద్యా విధానం
- 9 నుంచి 12 వరకు సీనియర్ సెకండరీ
- స్కూళ్లలోనే ఇంటర్ విద్య
- డ్రాపౌట్ల నివారణే సర్కార్ లక్ష్యం
- ప్రభుత్వ పాఠశాలలకు మౌలిక సదుపాయాల కొరత
- లెక్చరర్ల సర్వీస్ రూల్స్‌పై సందిగ్ధం
- కార్పొరేట్ కాలేజీల భవితవ్యంపై ప్రశ్నలు
- జేఈఈ, నీట్ సన్నద్ధతపై ఆందోళన
- అమల్లో సర్కార్‌కు సవాళ్ల మీద సవాళ్లు

ముద్ర, తెలంగాణ బ్యూరో :
తెలంగాణ విద్యా వ్యవస్థలో కీలక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. దాదాపు 55 ఏళ్లుగా కొనసాగుతున్న ఇంటర్మీడియట్ బోర్డుకు స్వస్తి పలికి, సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ తరహాలో 10+2 విద్యా విధానాన్ని అమలు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయించడం చర్చనీయాంశంగా మారింది. 2027–28 విద్యా సంవత్సరం నుంచి ఈ విధానాన్ని అమల్లోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. అయితే, విధానపరంగా కీలకంగా కనిపిస్తున్న ఈ నిర్ణయాన్ని క్షేత్రస్థాయిలో అమలు చేయడం ప్రభుత్వానికి పెద్ద సవాలుగా మారనుంది.

మూడు విభాగాలుగా పాఠశాల విద్య
కొత్త విధానం ప్రకారం నర్సరీ నుంచి నాలుగో తరగతి వరకు ప్రాథమిక విద్య, ఐదు నుంచి ఎనిమిదో తరగతి వరకు సెకండరీ విద్య, తొమ్మిది నుంచి మిగతా 02లో

తీన్మార్ మల్లన్న పాదయాత్రలో విషాదం

8

- కాన్వాయ్‌పై దూసుకొచ్చిన లారీ
- రెండు కార్లు నుజ్జునుజ్జు
- భార్యాభర్తల పరిస్థితి విషమం..
- రెండేళ్ల చిన్నారికి తీవ్ర గాయాలు
- తృటిలో తప్పించుకున్న తీన్మార్ మల్లన్న..
- ప్రమాదంపై అనుమానాలు




-ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి

కూల్ డ్రింక్, చిప్స్ కంటే ఫోన్ రీచార్జ్ చీప్

- నెలకు రూ.350 రీఛార్జ్ తప్పనిసరి కావాలి!
- మొబైల్ టారిఫ్‌లు పెరగాల్సిందే.. ఎయిర్ టెల్ 'మిట్టల్' డిమాండ్!
- రోజుకు రూ.10 ఖర్చు చేయలేరా?
- 5G పెట్టుబడులకు తగిన ఆదాయం రావడం లేదు!

6




నా ఫోన్ ట్యాప్

ప్రధానికి ఎలా తెలుస్తుందో చెప్పిన రాహుల్

- నా ఫోన్‌లోనే అన్ని సాక్ష్యాలు..
- ఫోన్ ట్యాపింగ్‌పై రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు
- మోదీతో ముఖాముఖి చర్చకు సిద్ధం

2



ఏపీకి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు

సీఐఐ సదస్సుతో 303 ఒప్పందాలు


- లక్షలాది ఉద్యోగాలకు అవకాశం
- 5 రోజుల్లోనే పరిశ్రమలకు అనుమతులు
- ఏఐ, గ్రీన్ ఎనర్జీపై ఫోకస్..
- 'వన్ ఫ్యామిలీ – వన్ ఏఐ' చంద్రబాబు లక్ష్యం
- రిలయన్స్, కియా భారీ పెట్టుబడులు..
- సీఎం చంద్రబాబు



2

ఇదీ AI ముద్ర


బిహార్‌లో ప్రభుత్వ శాఖలో ఉన్నత హోదాలో పనిచేస్తున్న ఓ మహిళా అధికారికి గత 8 నెలలుగా జీతం అందలేదని ఆఫీస్ బయట అడ్డుకోవడం సంచలనమైంది.



సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews
శనివారం, 14 నవంబర్, 2026

చెడు కొలెస్ట్రాల్ తగ్గించడంలో సహాయం!

చింతచిగురులో పుష్కలంగా ఉండే ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు గుండె ఆరోగ్యానికి తోడ్పడవచ్చు. సమతుల్య ఆహారంలో భాగంగా తీసుకుంటే కొలెస్ట్రాల్ నియంత్రణకు సహాయపడవచ్చు.



ఆటో కార్మికులకు గుడ్‌న్యూస్

ముద్ర, హైదరాబాద్:
కోర్ అర్బన్ పరిధిలో ఆటో కార్మికులకు ప్రత్యేకంగా ఇందిరమ్మ ఇండ్ల టవర్లు నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నాలుగు ప్రాంతాల్లో రూ.220 కోట్లతో ఆటోనగర్ కాలనీలు నిర్మించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బండ్లగూడ, గంధంగూడ, పేట్ బషీర్‌బాగ్, జల్ పల్లి లక్ష్మీగూడలో హౌసింగ్ బోర్డ్ ఆటోనగర్ కాలనీలను నిర్మించనుంది. ఒక్కో ప్రాంతంలో 500 చొప్పున 2వేల ఎల్ఐజీ ఫ్లాట్లను నిర్మిస్తారు. ఇప్పటికే క్యూర్ పరిధిలో అల్పాదాయ కుటుంబాలకు నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్ల పథకం విధివిధానాలు, అర్హతలు, కేటాయింపు విధానం ఆటోనగర్ కాలనీలకు వర్తిస్తుందని జీవోలో పేర్కొన్నారు.

తెలంగాణ సత్తా చాటుతాం

ముద్ర, తెలంగాణ బ్యూరో :
తెలంగాణను పెట్టుబడులకు అత్యంత అనుకూలమైన రాష్ట్రంగా ప్రపంచానికి పరిచయం చేయడమే భారత్ సమ్మిట్ ప్రధాన ఉద్దేశమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఉన్న మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అనువైన పారిశ్రామిక వాతావరణాన్ని అంతర్జాతీయ స్థాయిలో చాటిచెప్పేందుకు ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు తెలిపారు. హైదరాబాద్‌లో రెండు రోజుల పాటు జరుగుతున్న భారత్ సమ్మిట్ సందర్భంగా బోధి పెవిలియన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో సీఎం మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కతో పాటు పలువురు మంత్రులు, ఎంపీలు, కేంద్ర మాజీ మంత్రి సల్మాన్ ఖుర్షీద్ పాల్గొన్నారు. దాదాపు 70 దేశాల నుంచి వివిధ రంగాలకు చెందిన వెయ్యి మంది ప్రతినిధులను ఈ సదస్సుకు ఆహ్వానించినట్లు సీఎం వెల్లడించారు.



డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 కు ముందు రాష్ట్రంలో పెట్టుబడుల అవకాశాలను ప్రపంచానికి వివరించడమే భారత్ సమ్మిట్ లక్ష్యమన్నారు. పర్యావరణం, మౌలిక సదుపాయాలు, పెట్టుబడులు, మానవ వనరులు వంటి అంశాలపై వివిధ సెమినార్లు నిర్వహించి, నిపుణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులు తిరిగి వెళ్లిన తర్వాత తెలంగాణకు బ్రాండ్ అంబాసిడర్లుగా మారతారన్నారు.
ఇదే సందర్భంగా గిగ్ వర్కర్ల సంక్షేమంపై కూడా సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. ప్లాట్‌ఫామ్ వర్కర్లు, డెలివరీ సిబ్బంది, డ్రైవర్లు, ఇతర అసంఘటిత రంగ కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు దేశంలోనే అత్యుత్తమ గిగ్ వర్కర్స్ పాలసీని తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిందని తెలిపారు. ఈ పాలసీ ఆవిష్కరణ కార్యక్రమానికి లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీని ఆహ్వానించినట్లు వెల్లడించారు.
భారత్ సమ్మిట్‌ను కొందరు రాజకీయ కారణాలతో వ్యతిరేకించడం సరికాదని రేవంత్ రెడ్డి అన్నారు. అర్థరహితమైన ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించవద్దని విజ్ఞప్తి చేశారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడం, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం, రాష్ట్రానికి భారీ పెట్టుబడులను ఆకర్షించడం ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. తెలంగాణ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలకు అందరూ సహకరించాలని కోరారు.



ట్రాఫిక్ కష్టాలకు చెక్

ముద్ర, తెలంగాణ బ్యూరో:
హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ (PRTS) అందుబాటులోకి తీసుకురావాలని తెలంగాణ ప్ర భుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మూడు కారిడార్ల ఏర్పాటుకు సీఎం రేవం త్ రెడ్డి ఆమోదం తెలిపారు. కేపీహెచ్‌బీ మెట్రో స్టేషన్ నుంచి దుర్గం చెరువు, మైండ్‌స్పే స్ మీదుగా బయోడైవర్సిటీ వరకు మొదటి మార్గాన్ని ఏర్పాటు చేయనున్నారు. రెండో మార్గం ఎల్బీ స్టేడియం నుంచి అంబేడ్కర్ విగ్రహం, ఇందిరాపార్క్, లోయర్ ట్యాంక్ బండ్ మీదుగా రాణిగంజ్ వరకు, మూడో మార్గం అసెంబ్లీ మెట్రో స్టేషన్ నుంచి రవీంద్రభారతి, సచివాలయం, ఐమాక్స్ మీదుగా బేగంపేట వరకు నిర్మించనున్నారు. ఈ మూడు మార్గాలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను డిసెంబర్ నాటికి పూర్తి చేయా లని సీఎం అధికారులను ఆదేశించారు. తొలి మార్గాన్ని ఏడాదిలోగా పూర్తి చేయాలని సూచించారు. గురువారం ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీఈలో నిర్వహించిన సమీక్షలో ఈ నిర్ణయాలు తీసుకున్నారు.

హరీశ్ రావుపై అవినీతి బాంబు



ముద్ర, మెదక్:
మాజీ మంత్రి హరీష్ రావుపై టీఆర్ఎస్ చీఫ్ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. శుక్రవారం సిద్దిపేటలో టీఆర్ఎస్ జిల్లా కార్యాలయ నిర్మాణానికి భూమి పూజ చేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఉద్యమ సమయంలో 1200 మంది ఉద్యమకారుల మరణాలకు హరీష్ రావు కారణమని ఆరోపించారు. మల్లన్న సాగర్ నిర్మాణంలో అంచనాల పెంపు, ఎన్‌జీఆర్ఐ నివేదికను పక్కన పెట్టడం, కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి జరిగాయని విమర్శించారు. హరీష్ రావు ఆస్తుల పెరుగుదల, పాల వ్యాపారంపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. అవినీతి ఆరోపణలపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే లోకాయుక్తను ఆశ్రయించి, కోర్టుకు వెళ్తానని హెచ్చరించారు. ఈ నెల 19న సిద్దిపేట వేదికగా సీఎం రేవంత్ రెడ్డి తన ప్రశ్నలకు సమాధానం చెప్పాలని సవాల్ విసిరారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలో అనూహ్య పరిణామాలు

- సీఎం రేవంత్

ముద్ర, హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసులో త్వరలో అనూహ్య పరిణామాలు ఉంటాయని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో సీఎం.. మీడియాతో ఇష్టాగోష్టి నిర్వహించారు. ''కేంద్రం నా ఫోన్ ట్యాప్ చేసినా నష్టం లేదు.. నేను ఏది మాట్లాడినా బహిరంగమే. ఖేలో ఇండియా పోటీలకు ఆహ్వానించేందుకే ఎల్లుండి ప్రధాని మోదీతో భేటీ. మియాపూర్ భూముల వేలాన్ని అడ్డుకుంటామన్న బీఆర్ఎస్ హెచ్చరికలు డబ్బుల కోసమే. ఉద్యమం సమయంలో ల్యాంకో హిల్స్, పద్మాలయ భూములపై రాద్ధాంతం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత డబ్బులు వసూలు చేసి వాటిపై మాట్లాడలేదు. కవిత ఇంటిపై డ్రోన్ ఎవరు ఎగరేశారో నాకు తెలియదు. కవిత కుటుంబ పంచాయితీల్లోనే ఏదో జరిగి ఉంటుంది.. వాళ్లే తేల్చుకుంటారు. కేటీఆర్ గడ్డం పెంచితే ఆయన మోకాళ్లకే అడ్డం వస్తుంది తప్ప నాకేం ఇబ్బంది ఉండదు. భారతీయుల ఆత్మ కాంగ్రెస్ పార్టీ. భాజపా స్వాతంత్ర్యానికి ముందు లేదు.. పాతికేళ్ల తర్వాత ఉండదు. ఇటీవల దిల్లీలో నిర్వహించిన 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమిట్ కర్టెన్ రైజర్' కార్యక్రమానికి పిలిస్తే కిషన్‌రెడ్డి, బండి సంజయ్ రాలేదు. అందుకే భారత్ సమిట్‌కు ఆహ్వానించలేదు. కిషన్‌రెడ్డి వస్తానంటే నేనే స్వయంగా వెళ్లి పిలుస్తా'' అని సీఎం తెలిపారు.



నా ఫోన్ ట్యాప్

ముద్ర, న్యూఢిల్లీ:
ప్రధాని నరేంద్ర మోదీపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు. తన ఫోన్ ట్యాప్ అవుతోందని, తనకు సంబంధించిన సమాచారం ప్రధానికి అందుతున్నట్లు ఆరోపించారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ నెటిజన్ అడిగిన ప్రశ్నకు సమాధానంగా తన మొబైల్‌ను చూపిస్తూ.. అన్ని సాక్ష్యాలు అందులోనే ఉన్నాయని వ్యాఖ్యానించారు. విదేశీ శక్తుల నియంత్రణలో ఎవరున్నారో ప్రధాని మోదీతో ముఖాముఖి చర్చకు సిద్ధమైన రోజే ప్రపంచానికి తెలుస్తుందన్నారు. ఏ వేదికపైనైనా మోదీతో వన్ టు వన్ డిబేట్‌కు తాను సిద్ధమని సవాల్ విసిరారు. అవసరమైతే అదానీ, ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌ను చర్చకు జడ్జిలుగా పెట్టుకోవచ్చని పేర్కొన్నారు. చర్చ అనంతరం మోదీ ప్రధానిగా కొనసాగలేరని రాహుల్ వ్యాఖ్యానించారు. గతంలోనూ రఫేల్ ఒప్పందం, అవినీతి అంశాలపై మోదీకి బహిరంగ చర్చకు సవాల్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు.



ఏపీకి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు

ముద్ర, విశాఖపట్నం:
ఆంధ్రప్రదేశ్‌కు భారీగా పెట్టుబడులు తరలివస్తున్నాయని సీఎం చంద్రబాబు నాయుడు వెల్లడించారు. విశాఖపట్నంలో రెండు రోజుల పాటు నిర్వహించిన సీఐఐ భాగస్వామ్య సదస్సు ద్వారా 303 ప్రతిపాదనల రూపంలో రూ.9.89 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. తయారీ, ఫుడ్ ప్రాసెసింగ్, ఐటీ, వైద్యం, ఏవియేషన్, ఆటోమొబైల్, ఏరోస్పేస్, డిఫెన్స్, ఎలక్ట్రానిక్స్ తదితర రంగాల్లో ఈ పెట్టుబడులు రానున్నాయని పేర్కొన్నారు. సదస్సు ముగింపు కార్యక్రమంలో శుక్రవారం మాట్లాడిన చంద్రబాబు.. 2024 జూన్ నుంచి ఇప్పటివరకు రాష్ట్రానికి మొత్తం 714 ప్రాజెక్టుల ద్వారా రూ.22.60 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని, వీటి ద్వారా 19.3 లక్షల ఉద్యోగావకాశాలు కలగనున్నాయని వెల్లడించారు. తాజా సదస్సులో రిలయన్స్ సంస్థ రూ.2.43 లక్షల కోట్ల పెట్టుబడులకు ముందుకు రాగా, కియా సంస్థ అదనంగా ఏడాదికి రెండు లక్షల కార్ల తయారీ సామర్థ్యం పెంచేందుకు రూ.19 వేల కోట్లు పెట్టుబడి పెట్టనుందని తెలిపారు.
మంత్రి నారా లోకేష్ సమక్షంలో రెండో రోజు 24 కంపెనీలు రూ.1,05,634 కోట్ల పెట్టుబడులకు ఒప్పందాలు చేసుకున్నాయి. వీటి ద్వారా ఏరోస్పేస్, ఐటీ, ఎలక్ట్రానిక్స్, డేటా సెంటర్లు, సెమీకండక్టర్లు, హెల్త్‌కేర్, పునరుత్పాదక ఇంధన రంగాల్లో సుమారు 75,055 ఉద్యోగాలు అందుబాటులోకి రానున్నాయి. పారిశ్రామిక అనుమతులను ఐదు రోజుల్లోనే జారీ చేసే విధానాన్ని అమలు చేస్తున్నామని సీఎం తెలిపారు. ఆటోమేటిక్ అప్రూవల్స్, సెల్ఫ్ సర్టిఫికేషన్‌తో పాటు పారిశ్రామిక ప్రోత్సాహకాల చెల్లింపులకు ఎస్క్రో ఖాతా విధానాన్ని ప్రారంభించామని చెప్పారు. పెట్టుబడిదారుల భద్రత కోసం త్వరలో ఇన్వెస్ట్‌మెంట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకురానున్నట్లు ప్రకటించారు.



ఘాటీ సుబ్రహ్మణ్య క్షేత్రం

ముద్ర, బెంగళూరు:
దక్షిణ భారతదేశంలోని ప్రముఖ సుబ్రహ్మణ్య స్వామి పుణ్యక్షేత్రాల్లో కర్ణాటక రాష్ట్రంలోని ఘాటీ సుబ్రహ్మణ్య క్షేత్రం విశిష్ట స్థానాన్ని సంపాదించుకుంది. ప్రకృతి అందాల నడుమ వెలసిన ఈ పవిత్ర ఆలయం భక్తుల ఆధ్యాత్మిక విశ్వాసాలకు ప్రతీకగా నిలుస్తోంది. నాగ దేవత రూపంలో శ్రీ సుబ్రహ్మణ్య స్వామి, మరోవైపు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఒకే శిలపై కొలువుదీరడం ఈ క్షేత్రం ప్రత్యేకత.
స్థలపురాణం..నాగరూపంలో స్వామివారి తపస్సు
పురాణ కథనం ప్రకారం, గరుడుడి నుంచి నాగజాతికి రక్షణ కల్పించాలనే సంకల్పంతో శ్రీ సుబ్రహ్మణ్య స్వామి ఈ ప్రాంతంలో సర్ప రూపంలో తపస్సు ఆచరించారని ప్రతీతి. స్వామివారి ప్రార్థనకు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుగ్రహించి నాగజాతికి రక్షణ కల్పించారని స్థలపురాణం చెబుతోంది. మరో కథనం ప్రకారం ఘటికాసురుడు అనే రాక్షసుడిని స్వామివారు సంహరించిన ప్రదేశం కావడంతో ఈ ప్రాంతానికి ఘాటీ అనే పేరు వచ్చిందని చెబుతారు.
ఒకే శిలపై రెండు దివ్యరూపాలు
ఈ క్షేత్ర గర్భాలయంలోని మూలవిరాట్ అత్యంత ప్రత్యేకమైనది. ఒకే శిలపై ముందు భాగంలో ఏడు పడగల నాగరూపంలో సుబ్రహ్మణ్య స్వామి, వెనుక భాగంలో లక్ష్మీ నరసింహ స్వామి కొలువుదీరారు. సుబ్రహ్మణ్య స్వామి తూర్పు ముఖంగా, నరసింహ స్వామి పడమర ముఖంగా దర్శనమిస్తారు. గర్భాలయంలో ఏర్పాటు చేసిన అద్దం ద్వారా భక్తులు ఇద్దరు స్వామివార్లను ఒకేసారి దర్శించుకునే అవకాశం కల్పించారు.
నాగప్రతిష్ఠకు ప్రత్యేక గుర్తింపు
ఘాటీ సుబ్రహ్మణ్య క్షేత్రం సర్పారాధనకు ప్రసిద్ధి. ఆలయ పరిసరాల్లో భక్తులు నాగప్రతిష్ఠలు చేయిస్తుంటారు. సర్పదోష నివారణ, కుజదోష పరిహార పూజలు, నాగప్రతిష్ఠ వంటి ఆచారాలు ఇక్కడ నిర్వహిస్తారు. సంతానం, కుటుంబ సౌఖ్యం, శ్రేయస్సు కోసం భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. ఇవన్నీ భక్తుల విశ్వాసాలకు సంబంధించిన ఆచారాలు.
జాతర... ఉత్సవాలు
ప్రతి సంవత్సరం పుష్య శుద్ధ షష్ఠి సందర్భంగా బ్రహ్మరథోత్సవం వైభవంగా నిర్వహిస్తారు. నరసింహ జయంతి కూడా ఇక్కడ ముఖ్యమైన పర్వదినం. డిసెంబర్ నెలలో జరిగే పశువుల సంతకు కర్ణాటకతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు తదితర ప్రాంతాల నుంచి రైతులు, పశుపోషకులు, వ్యాపారులు తరలివస్తారు.
భక్తులకు దర్శన సమాచారం
ప్రాంతం: మెలిసజుగనహళ్లి గ్రామం
తాలూకా: దొడ్డబళ్లాపురం
జిల్లా: బెంగళూరు గ్రామీణం, కర్ణాటక
బెంగళూరు నుంచి: సుమారు 55 కిలోమీటర్లు
దర్శన వేళలు: ఉదయం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు

భక్తి.. విశ్వాసం.. ఆధ్యాత్మికత కలగలిసిన ఘాటీ సుబ్రహ్మణ్య క్షేత్రం భక్తులకు విశిష్టమైన దర్శనానుభూతిని అందిస్తోంది. నాగదేవతగా సుబ్రహ్మణ్య స్వామి, నరసింహ రూపంలో శ్రీమహావిష్ణువు ఒకే శిలపై కొలువుదీరిన ఈ పవిత్ర క్షేత్రం దక్షిణ భారత ఆధ్యాత్మిక పర్యాటక పటంలో ప్రత్యేక గుర్తింపు పొందింది.

రేవంత్‌కు ఇంటర్ సవాల్

(మొదటి పేజీ తరువాయి)
పన్నెండో తరగతి వరకు సీనియర్ సెకండరీ విద్యగా పాఠశాల విద్యాశాఖను పునర్వ్యవస్థీకరించాలని ప్రతిపాదిస్తున్నారు. దీంతో పదో తరగతి తర్వాత విద్యార్థులు ప్రత్యేకంగా జూనియర్ కాలేజీలకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. పాఠశాలల్లోనే ఇంటర్మీడియట్ విద్యను కొనసాగించే అవకాశం ఏర్పడుతుంది. పదో తరగతి తర్వాత గ్రామీణ ప్రాంతాలు, పేద కుటుంబాలు, బాలికలు, దళిత, గిరిజన, మైనారిటీ వర్గాలకు చెందిన విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారనే ఆందోళన ఉంది. ఈ డ్రాపౌట్లను అరికట్టడంతో పాటు కార్పొరేట్ జూనియర్ కాలేజీల్లో నెలకొన్న మార్కుల పోటీ, ఒత్తిడి నుంచి విద్యార్థులకు ఉపశమనం కల్పించడం ఈ సంస్కరణ ప్రధాన లక్ష్యాలుగా ప్రభుత్వం చెబుతోంది.

మౌలిక సదుపాయాలే తొలి అడ్డంకి
అయితే, ఈ విధానం అమలులోకి రావాలంటే ముందుగా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారాల్సి ఉంటుంది. రాష్ట్రంలోని వేలాది ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఇప్పటికే తరగతి గదులు, ప్రయోగశాలలు, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాల కొరత ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో 11, 12 తరగతులను కూడా పాఠశాలల్లో నిర్వహించాలంటే అదనపు తరగతి గదులు, సైన్స్ ల్యాబ్‌లు, గ్రంథాలయాలు, క్రీడా సదుపాయాలు కల్పించాల్సి ఉంటుంది. ఇందుకు భారీగా నిధులు అవసరం. ఏడాది వ్యవధిలోనే రాష్ట్రవ్యాప్తంగా ఈ ఏర్పాట్లు చేయడం అంత సులభం కాదు.

లెక్చరర్ల సర్వీస్ రూల్స్ సంగతేంటి?
విద్యా సంస్కరణలో మరో కీలక అంశం ఉపాధ్యాయులు, అధ్యాపకుల ఉద్యోగ భద్రత. ప్రస్తుతం స్కూల్ అసిస్టెంట్లు పాఠశాల విద్యాశాఖ పరిధిలో ఉండగా, జూనియర్ లెక్చరర్లు ఇంటర్మీడియట్ విద్యాశాఖ పరిధిలో పనిచేస్తున్నారు. వీరికి వేర్వేరు సర్వీస్ రూల్స్, వేతనాలు, పదోన్నతుల విధానాలు ఉన్నాయి. 2 విభాగాలను ఏకీకృతం చేస్తే సీనియారిటీ, పదోన్నతులు, బదిలీలు, సర్వీస్ ప్రయోజనాల విషయంలో వివాదాలు తలెత్తే అవకాశం ఉంది. జూనియర్ లెక్చరర్ల సంఘాల అభ్యంతరాలను పరిష్కరించకుండా ముందుకు వెళ్తే ఆందోళనలు ఎదురయ్యే ప్రమాదం ఉంది.

కార్పొరేట్ కాలేజీల భవితవ్యం ఏమిటి?
మరోవైపు ప్రైవేట్, కార్పొరేట్ జూనియర్ కాలేజీల భవిష్యత్తు కూడా ప్రశ్నార్థకంగా మారనుంది. ప్రస్తుతం ఇంటర్మీడియట్ విద్యా రంగంలో కీలక పాత్ర పోషిస్తున్న ఈ సంస్థలు కొత్త విధానంలో ఎలాంటి పాత్ర పోషిస్తాయన్నది స్పష్టత రావాల్సి ఉంది. వాటి నిర్వహణ, గుర్తింపు, అనుమతులు, అధ్యాపకుల భవిష్యత్తుపై ప్రభుత్వం మార్గదర్శకాలు రూపొందించాల్సి ఉంటుంది. ఇక ఎప్‌సెట్, జేఈఈ, నీట్ వంటి ప్రవేశ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేసే విధానంలోనూ మార్పులు అవసరమవుతాయి. కొత్త 10+2 సిలబస్‌ను జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల సిలబస్‌తో సమన్వయం చేయకపోతే విద్యార్థులు, తల్లిదండ్రుల్లో గందరగోళం ఏర్పడే అవకాశం ఉంది.

దశలవారీ అమలే పరిష్కారమా?
ఈ సవాళ్లను అధిగమించేందుకు ప్రభుత్వం ముందుగా ఎంపిక చేసిన ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ తరహాలో అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉంది. అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించిన తర్వాత దశలవారీగా 11, 12 తరగతులను ప్రారంభించవచ్చని విద్యావేత్తలు సూచిస్తున్నారు. ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాలతో చర్చలు జరిపి సర్వీస్ రూల్స్‌కు చట్టపరమైన భరోసా కల్పించడం కూడా కీలకం.
మొత్తంగా 55 ఏళ్లుగా కొనసాగుతున్న విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావడం కేవలం ప్రభుత్వ ఉత్తర్వులతో సాధ్యమయ్యే పని కాదు. భారీ బడ్జెట్ కేటాయింపులు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం, ప్రైవేట్ విద్యా సంస్థలకు స్పష్టమైన మార్గదర్శకాలు అవసరం. వీటన్నింటినీ సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు వెళ్తేనే కొత్త విద్యా విధానం లక్ష్యాలు నెరవేరుతాయి. లేదంటే సంస్కరణల అమలులో జాప్యం, విద్యార్థుల చదువులో గందరగోళం ఏర్పడే అవకాశం ఉంది.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 14.11.2026
www.mudranews.in | @mudranews

రోగనిరోధక శక్తికి మద్దతు!

చింతచిగురులో ఉండే విటమిన్ సి, యాంటీఆక్సిడెంట్లు శరీర రోగనిరోధక వ్యవస్థ సాధారణంగా పనిచేయడానికి సహాయపడతాయి.



తెలంగాణలో గిగ్ వర్కర్లకు కొత్త పాలసీ


రాష్ట్రంలో గిగ్ వర్కర్స్ పాలసీపై సీఎం రేవంత్ రెడ్డి బిగ్ అప్ డేట్

ముద్ర, హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం గిగ్ వర్కర్ల సంక్షేమం కోసం ప్రత్యేక చట్టం తీసుకొచ్చింది. అయితే ఈ గిగ్ వర్కర్ల పాలసీని రేపటి నుంచి అమలు చేయాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఇవాళ హైదరాబాద్ లో మీడియాతో మాట్లాడిన ముఖ్యమంత్రి.. గిగ్ వర్కర్ల సమక్షంలో పాలసీ అంకితం చేయాలని రాహుల్ గాంధీని రాష్ట్రానికి ఆహ్వానించామని సీఎం చెప్పారు. కాగా భారత్ సమ్మిట్ లో పాల్గొనేందుకు రాహుల్ గాంధీ ఇవాళ హైదరాబాద్‌కు రాబోతున్నారు. రేపు గిగ్ వర్కర్లతో ఆయన సమావేశమవుతారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని దాదాపు 6 లక్షల మంది గిగ్ వర్కర్ల సంక్షేమం, సామాజిక భద్రత కోసం ప్రభుత్వం రూపొందించిన రూల్స్ అండ్ రెగ్యులేషన్స్, సంక్షేమ పథకాలను రాహుల్ గాంధీ ప్రకటించనున్నారు.



చేనేత కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మీడియా అకాడమీ చైర్మన్‌కు తెలంగాణ చేనేత కార్మిక సంఘం వినతి



ముద్ర, హైదరాబాద్: చేనేత పరిశ్రమ ఎదుర్కొంటున్న సమస్యలను, కార్మికుల ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వనం శాంతి కుమార్, కార్యదర్శి ముషం నరహరి శుక్రవారం మీడియా అకాడమీ ఆఫ్ తెలంగాణ చైర్మన్ కె. శ్రీనివాస్ రెడ్డిని ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా చేనేత రంగం పరిస్థితి, కార్మికుల సమస్యలపై ఆయనతో చర్చించి వినతిపత్రం సమర్పించారు. చేనేత సహకార సంఘాల్లో ఉత్పత్తి చేసిన వస్త్రాలను టెస్కో కొనుగోలు చేయాలని కోరారు. త్రిఫ్ట్ పథకంలో కార్మికులు 20 నెలలుగా తమ వాటా డిపాజిట్ చేస్తున్నప్పటికీ, ప్రభుత్వం కేవలం రెండు నెలలు మాత్రమే జమ చేసిందని, మరో నాలుగు నెలల్లో పథకం గడువు ముగియనున్నా మిగతా మొత్తాన్ని జమ చేయలేదని వివరించారు. అలాగే 2024 జనవరి నుంచి అందించాల్సిన చేనేత భరోసాను ప్రభుత్వం కేవలం మూడు నెలలు మాత్రమే కార్మికుల ఖాతాల్లో జమ చేసిందని తెలిపారు. నేతన్న బీమా ప్రీమియం కూడా చెల్లించకపోవడంతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని శ్రీనివాస్ రెడ్డిని కోరారు. దీనిపై స్పందించిన ఆయన చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు వనం శాంతి కుమార్ తెలిపారు.

టీపీసీసీ విచార్ విభాగ్ ప్రోగ్రాం కమిటీ ఛైర్మన్‌గా విశాల్ తాడిశెట్టి



ముద్ర, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) విచార్ విభాగ్ (మేధో విభాగం) ప్రోగ్రాం కమిటీ ఛైర్మన్‌గా విశాల్ తాడిశెట్టి నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ నాయకత్వం ఆయన నియామకాన్ని ప్రకటించి, పత్రాలను అందజేసింది.కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన కార్యక్రమాల రూపకల్పన, నిర్వహణతో పాటు విచార్ విభాగ్ కార్యకలాపాలను సమన్వయం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు.ఈ సందర్భంగా విశాల్ తాడిశెట్టికి పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆయన మిత్రులు అభినందనలు తెలియజేశారు.

నక్సల్ రహిత భారత్ లక్ష్యంగా 'వార్తాలాప్'

తెలంగాణలో 829 మంది నక్సల్స్ అరెస్టు.. 918 మంది లొంగుబాటు



ముద్ర, భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 13: 'నక్సల్ రహిత భారత్' లక్ష్యంగా చేపడుతున్న చర్యలు, వామపక్ష తీవ్రవాద నిర్మూలన వ్యూహాలు, లొంగిపోయిన నక్సల్స్ పునరావాసం, ప్రభావిత ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలపై పీఐబీ హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో 'వార్తాలాప్' కార్యక్రమం నిర్వహించారు. ఐపీఎస్ అధికారి సీహెచ్. సింధు శర్మ మాట్లాడుతూ తెలంగాణలో నక్సల్స్ నిర్మూలనకు చేపడుతున్న చర్యలు, పోలీసుల త్యాగాలు, లొంగుబాటు, పునరావాస విధానాలను వివరించారు. మారుమూల ప్రాంతాల్లో రహదారులు, వైద్యం, విద్య, మౌలిక సదుపాయాలు, సంక్షేమ పథకాల అమలుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జిల్లా ఎస్పీ బి. రోహిత్ రాజు మాట్లాడుతూ 2014 నుంచి 2026 మధ్య తెలంగాణలో 829 మంది నక్సల్స్ అరెస్టు కాగా, 918 మంది లొంగిపోయారని వెల్లడించారు. తీవ్రవాద ప్రభావిత ప్రాంతాల్లో వైద్య శిబిరాలు, సోలార్ దీపాలు, రహదారులు, పాఠశాలలు, క్రీడా సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. పీఐబీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మానస్ కృష్ణకాంత్, ఇతర అధికారులు పాల్గొనగా ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన సుమారు 100 మంది పాత్రికేయులు హాజరయ్యారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్ కోసం తెలంగాణ కోచ్‌లకు శిక్షణ

ముద్ర, హైదరాబాద్: ఖేలో ఇండియా యూత్ గేమ్స్–2026లో తెలంగాణ క్రీడాకారులు మెరుగైన ప్రతిభ కనబరిచేలా తెలంగాణ క్రీడా ప్రాధికార సంస్థ (SATG) కోచ్‌లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. నవంబర్ 13, 14 తేదీల్లో హకీంపేటలోని తెలంగాణ స్పోర్ట్స్ స్కూల్‌లో రెండు రోజుల కోచ్‌ల క్లినిక్ శుక్రవారం ప్రారంభమైంది. తొలిరోజు నందన్ ఫడ్నిస్ కోచింగ్ ఫిలాసఫీపై శిక్షణ ఇచ్చారు. రెండో రోజు డాక్టర్ ముగ్ధా బవారే స్పోర్ట్స్ సైకాలజీ, పోటీలకు మానసిక సంసిద్ధతపై అవగాహన కల్పించనున్నారు. ఒత్తిడిని అధిగమించడం, ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవడం, పోటీల్లో సమర్థవంతంగా నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలపై నిపుణులు మార్గనిర్దేశం చేయనున్నారు. నాణ్యమైన కోచింగ్ ద్వారా రాష్ట్ర క్రీడాకారులను జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీలకు సిద్ధం చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని SATG వెల్లడించింది.

TELANGANA RISING
CURE - PURE - RARE

కలిసి ఎదుగుదాం

INVEST TELANGANA
GLOBAL SUMMIT
2026
7 | 8 | 9 డిసెంబర్ 2026
భారత్ ఫ్యూచర్ సిటీ, హైదరాబాద్



ప్రగతి పథం.. సకల జనహితం.. మన ప్రజా ప్రభుత్వం...

జారీ చేసిన వారు: సమాచార పౌర సంబంధాల శాఖ, తెలంగాణ ప్రభుత్వం

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
www.mudranews.in | @mudranews

శనివారం,
14 నవంబర్, 2026

4 వేదిక
Peoples Voice

నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్ గా మీ భావాలను వ్యక్తీకరించండి..

వాట్సప్ నం.: 9849623744
మెయిల్: mudradaily@gmail.com

పసితనం పదిలమైతేనే..

ప్రగతి పథం సుగమం!

దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే రూపుదిద్దుకుంటుందన్నది అక్షర సత్యం. మరి ఆ భవితకు పునాదులైన పసిమనసులు నేడు ఎటువైపు అడుగులేస్తున్నాయి? ఆటపాటలతో వికసించాల్సిన బాల్యాన్ని మార్కులు, ర్యాంకుల ఒత్తిడి కుంగదీస్తోందా? ఒకవైపు ఆకలి, పౌష్టికాహార లోపం.. మరోవైపు చరవాణి వ్యసనం, మత్తు పదార్థాల విషవలయం బాల్యాన్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే మానవీయ విలువలను కాపాడుకోవాల్సిన తరుణమిది. చాచా నెహ్రూ కలలుగన్న నవభారత నిర్మాణానికి బాల్యానికి భరోసా కల్పించడమే తొలి అడుగు.



నవంబరు 14 బాలల దినోత్సవం సందర్భంగా

గుగ్గోజు రవీంద్రాచారి
జర్నలిస్ట్, 9848772232



బాల్యం అనగానే ఆటపాటలు, అల్లరి చేష్టలు, అమ్మానాన్నల ఆప్యాయతలు, అమ్మమ్మ తాతయ్యల ఒడిలో కథలు గుర్తుకొస్తాయి. అమాయకత్వం, సృజనాత్మకత, అద్భుతమైన ఆలోచనలకు నిలయమైన పసిమనసులు పూలతోటలో విచ్చుకున్న గులాబీల్లాంటివి. వారి కలలను కట్టడి చేయకుండా స్వేచ్ఛగా ఎగరనివ్వాలి. ఎందుకంటే బాల్యంలో అలవడే అలవాట్లు, సంస్కారం, విలువలే జీవితానికి పునాదులు.

నెహ్రూ ఆశయాలకు సార్థకత

భారత తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూకు బాలలంటే ఎనలేని ప్రేమ. గులాబీని ధరించే ఆయన చిన్నారులను దేశానికి తరగని ఆస్తిగా భావించేవారు. ఆయన జన్మదినమైన నవంబరు 14ను బాలల దినోత్సవంగా జరుపుకుంటున్నాం. ఈ వేడుకలు ప్రసంగాలు, సంబరాలకే పరిమితం కాకుండా ప్రతి బిడ్డకు నాణ్యమైన విద్య, వైద్యం, పౌష్టికాహారం, రక్షణ, సమాన అవకాశాలు కల్పించినప్పుడే ఆయన ఆశయాలకు సార్థకత చేకూరుతుంది.

మారుతున్న బాల్యం

ఒకప్పుడు ఉమ్మడి కుటుంబాలు, విశాలమైన ఆటస్థలాలు, ప్రకృతి ఒడిలో బాల్యం ఆనందంగా గడిచేది. నేడు కుటుంబాల విచ్ఛిన్నం, తల్లిదండ్రుల ఉరుకుల పరుగుల జీవితం, పిల్లలకు సమయం కేటాయించలేకపోవడం వారి మానసిక ఎదుగుదలను ప్రభావితం చేస్తున్నాయి. మార్కులు, ర్యాంకులు, కార్పొరేట్ పోటీ పరీక్షల ఒత్తిడి, ఇతరులతో పోల్చడం, తమ ఆశయాలను పిల్లలపై రుద్దడం వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. ఫలితంగా సహజమైన ఆనందం, సృజనాత్మకత కనుమరుగవుతున్నాయి.

పోషణే ప్రగతికి పునాది

గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సమతుల పౌష్టికాహారం అందడం అత్యవసరం. అయినప్పటికీ పేదరికం, నిరక్షరాస్యత, అవగాహన లోపంతో అనేక మంది చిన్నారులు పోషకాహార లోపం, రక్తహీనత, ఎదుగుదల సమస్యలతో బాధపడుతున్నారు. ఇవి శారీరక ఎదుగుదలతోపాటు మెదడు వికాసం, జ్ఞాపకశక్తి, ఏకాగ్రతను దెబ్బతీస్తాయి. అంగన్వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాల అమలు అభినందనీయమే అయినా నాణ్యత, నిరంతర సరఫరాపై పర్యవేక్షణ అవసరం. పాలు, పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాలతో కూడిన ఆహారం ప్రతి బిడ్డకు అందాలి.

చరవాణి.. మత్తు ముప్పు

స్మార్ట్‌ఫోన్లు, సామాజిక మాధ్యమాలు, ఆన్‌లైన్ ఆటలకు చిన్నారులు బానిసలవుతున్నారు. హింసాత్మక, అసభ్యకర దృశ్యాలు, సైబర్ వేధింపులు, తప్పుడు సమాచారం వారి సున్నితమైన మనసులపై ప్రభావం చూపుతున్నాయి. మరోవైపు కృత్రిమ మేధ (ఏఐ) విద్య, వైద్యం, పరిశోధన రంగాల్లో కొత్త అవకాశాలను కల్పిస్తోంది. పాఠశాల స్థాయి నుంచే ఏఐ పరిజ్ఞానంతోపాటు వ్యక్తిగత సమాచార భద్రత, తప్పుడు సమాచార గుర్తింపు, సాంకేతికతను విచక్షణతో వినియోగించే నైపుణ్యాలు నేర్పాలి. యంత్రాలకు బానిసలుగా కాకుండా వాటిని సృజనాత్మకంగా ఉపయోగించే తరంగా తీర్చిదిద్దాలి. గంజాయి, సింథటిక్ డ్రగ్స్ వంటి మత్తు పదార్థాల విషవలయంలో విద్యార్థులు చిక్కుకోవడం ఆందోళనకరం. చెడు స్నేహాలు, దురలవాట్లు భవిష్యత్తును అంధకారంలోకి నెడుతున్నాయి. ఘర్షణలు, దాడులు, ఉపాధ్యాయుల పట్ల దురుసు ప్రవర్తన కూడా కలవరపెడుతున్నాయి. పిల్లలను మాత్రమే నిందించకుండా కుటుంబ వాతావరణం, మానసిక ఒత్తిళ్లు, స్నేహితుల ప్రభావాన్ని పరిశీలించాలి. ప్రేమ, దయ, సహనం, క్రమశిక్షణ, పెద్దల పట్ల గౌరవం నేర్పాలి. భయంతో కాదు.. ఆప్యాయతతో సంస్కారాన్ని అలవర్చాలి.

చదువుతోపాటు సంస్కారం

విద్య అంటే కేవలం పుస్తకాలు, మార్కులు, ర్యాంకులు మాత్రమే కాదు. శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, సామాజిక నైపుణ్యాలు, సృజనాత్మకతల సమ్మేళనం. ఆటలు, క్రీడలు జట్టుస్ఫూర్తి, క్రమశిక్షణ, ఓటమిని స్వీకరించే మనస్తత్వాన్ని పెంపొందిస్తాయి. సంగీతం, చిత్రలేఖనం, నృత్యం, పుస్తక పఠనం, ప్రకృతితో అనుబంధం అంతర్గత ప్రతిభను వికసింపజేస్తాయి. వీటికి పాఠశాలల్లో సముచిత ప్రాధాన్యం ఇవ్వాలి. చదువుతోపాటు విజ్ఞానం, వినయం, సంస్కారం, గౌరవ మర్యాదలు అలవడాలి. పెద్దల పట్ల గౌరవం, చిన్నల పట్ల ఆప్యాయత, తోటి వారితో స్నేహభావం, ఇతరుల పట్ల దయ, కరుణ, ప్రేమానురాగాలు పెంపొందాలి. ఎదుటివారి భావాలను గౌరవించడం, కష్టాల్లో ఉన్నవారికి చేయూతనివ్వడం, నిజాయతీగా నడుచుకోవడం వంటి మానవీయ విలువలు బాల్యం నుంచే నేర్పాలి. చదువు జ్ఞానాన్నిస్తే.. సంస్కారం వ్యక్తిత్వానికి వన్నె తెస్తుంది. విజ్ఞానం ఉన్నత శిఖరాలకు చేరిస్తే.. వినయం, మానవత్వం సమాజంలో గౌరవాన్ని తెస్తాయి. విద్య ఎంత ముఖ్యమో విలువలతో కూడిన వ్యక్తిత్వ నిర్మాణం కూడా అంతే ముఖ్యం.

హక్కులకు.. భద్రతకు భరోసా

బాల కార్మికత్వం, బాల్యవివాహాలు, వేధింపులు, అక్రమ రవాణా, మధ్యలోనే చదువు మానేయడం వంటి రుగ్మతలను అరికట్టాలి. పేదరికం, లింగ వివక్షతో విద్యకు దూరమవుతున్న చిన్నారులను ఆదుకోవాలి. బాలికలకు భద్రత, ప్రత్యేక అవసరాలున్న పిల్లలకు సమాన అవకాశాలు కల్పించాలి. తల్లిదండ్రులు పిల్లలకు సమయం కేటాయిస్తూ వారి ఆలోచనలు, స్నేహాలను గమనించాలి. ఉపాధ్యాయులు అక్షరజ్ఞానంతోపాటు జీవిత పాఠాలు బోధించాలి. ప్రభుత్వం పథకాల నాణ్యతను పర్యవేక్షిస్తూ విద్య, వైద్యం, పౌష్టికాహారం, బాలల భద్రతకు భరోసా కల్పించాలి. మత్తు పదార్థాల సరఫరా, బాలలపై నేరాల విషయంలో కఠినంగా వ్యవహరించాలి. బాలల భవిష్యత్తు కుటుంబం, పాఠశాల, సమాజం, ప్రభుత్వాల సమష్టి బాధ్యత.

బాల్యమే భావి భారతానికి బలం

విత్తనంలో మహావృక్షం దాగి ఉన్నట్లే ప్రతి పసిమనసులో అపారమైన ప్రతిభ దాగి ఉంది. ఆకలితో అలమటించే బాల్యం నుంచి ఏఐతో ప్రపంచాన్ని శాసించే బాల్యం వరకు ప్రతి బిడ్డకూ సమాన అవకాశాలు దక్కాలి. బాలల కళ్లలో కన్నీళ్లు కాదు.. ఆశల కలలు కనిపించాలి. చేతుల్లో బరువైన పనులు కాదు.. భవిష్యత్తును నిర్మించే పుస్తకాలు ఉండాలి. మార్కుల ఒత్తిడి కాదు.. నేర్చుకోవాలనే జిజ్ఞాస పెరగాలి. చదువుతో విజ్ఞానం, ప్రవర్తనలో వినయం, వ్యక్తిత్వంలో సంస్కారం, మనసులో మానవత్వం వికసించాలి. బాల్యం ఒకసారి చేజారితే తిరిగి రాదు. పసితనాన్ని పదిలంగా కాపాడుకుంటేనే భావి భారతం భద్రంగా ఉంటుంది. బాలల వికాసమే దేశ ప్రగతికి వెలుగు అవుతుంది!

ప్రతి మలుపు ఒక పాఠం, ప్రతి గెలుపు ఒక గమ్యం.
జీవితం ఒక ప్రయాణం, అనుభవాల సారం.
నిన్నటి జ్ఞాపకాలు, రేపటి ఆశలు.
వర్తమానాన్ని ఆస్వాదించు, అదే జీవన సారం.

కష్టాలు వస్తాయి పోతాయి, నిన్ను నువ్వు నమ్ము.
ఓటమి అంచుల దాకా వెళ్ళు, విజయం కోసమే.
ప్రతి సవాలును స్వీకరించు, ధైర్యంగా ముందుకు సాగు.
నీ సామర్థ్యాన్ని ప్రపంచానికి చాటు.

చిరునవ్వుతో రోజును మొదలుపెట్టు, ఆనందంగా జీవించు.
ప్రతి క్షణం ఒక అవకాశం, సద్వినియోగం చేసుకో.
గతానికి చింతించకు, భవిష్యత్తు గురించి భయపడకు.
నీ జీవితాన్ని ఓ అందమైన కావ్యంగా మలచుకో.

ప్రేమ పంచడం నేర్చుకో, ఆప్యాయతను పెంచుకో.
బంధాలను గౌరవించు, స్నేహాలను నిలబెట్టుకో.
మనిషిగా జన్మించావంటే,

పాతికేళ్లకే పక్షవాతం

ముప్పును తప్పించుకోవడం ఎలా?

పక్షవాతం.. ఇప్పుడు 25 ఏళ్ల వయసున్న వారికి సైతం వస్తుండటం ఆందోళన కలిగిస్తోంది. ఎక్కువ సేపు తలనొప్పి ఉంటే నిర్లక్ష్యం చేయొద్దు. వెంటనే వైద్యుల వద్దకు వెళ్లాలని డాక్టర్లు చెబుతున్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఆరోగ్య పరిస్థితులు క్రమంగా మారుతున్నాయి. ఆందోళన కలిగించే విషయం ఏమిటంటే.. గత కొన్నేళ్లుగా పక్షవాతం కేవలం వృద్ధులకే పరిమితం కావడం లేదు. 15 నుంచి 49 ఏళ్ల మధ్య వయసున్న వారిలోనూ పక్షవాతం కేసులు వేగంగా పెరుగుతున్నాయి. ఒకప్పుడు వృద్ధాప్య సమస్యగా భావించిన ఈ వ్యాధి ఇప్పుడు యువతను సైతం వేధిస్తోంది. యువతలో పక్షవాతం వచ్చే ప్రమాదాన్ని పెంచే ప్రధాన కారణాల్లో అధిక రక్తపోటు, మధుమేహం, అధిక కొలెస్ట్రాల్, ధూమపానం, గుండె జబ్బులు ఉన్నాయి. ముఖ్యంగా మధుమేహం, ఊబకాయం, అధిక రక్తపోటు, అసాధారణ కొలెస్ట్రాల్ స్థాయిలు కలిసి ఉన్నప్పుడు పక్షవాతం వచ్చే ప్రమాదం మరింత పెరుగుతుంది. మధుమేహం కాలక్రమేణా రక్తనాళాలను దెబ్బతీస్తుంది. అధిక కొవ్వు, ముఖ్యంగా పొట్ట చుట్టూ పేరుకుపోయే కొవ్వు, ఇన్సులిన్ నిరోధకత, అధిక రక్తపోటు, ఇతర జీవక్రియ సంబంధిత సమస్యలతో ముడిపడి ఉంటుంది.

లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దు

యువతలో పక్షవాతం వచ్చినప్పుడు దాని పరిణామాలు తీవ్రంగా ఉండవచ్చు. అందువల్ల లక్షణాలను గుర్తించిన వెంటనే వైద్య సహాయం తీసుకోవడం చాలా ముఖ్యం. తల తిరగడం, నడవడంలో ఇబ్బంది, నడవలేకపోవడం లేదా శరీరంపై నియంత్రణ కోల్పోవడం వంటి ఆకస్మిక లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి. అలాగే చూపులో ఆకస్మిక మార్పులు రావడం, ఒక కంటిలో చూపు కోల్పోవడం లేదా పాక్షికంగా దృష్టి తగ్గడం వంటి లక్షణాలు కనిపించినా అప్రమత్తంగా ఉండాలి. శరీరంలో ఒకవైపు తిమ్మిరి రావడం లేదా మరోవైపు కంటే తక్కువగా స్పర్శను గుర్తించడం వంటి లక్షణాలు కనిపించినా ఆలస్యం చేయకుండా వైద్యుడిని సంప్రదించాలి.

ఈ రెండు స్ట్రోక్‌లు వస్తే ఆస్పత్రికి వెళ్లాలి

శరీరానికి రక్తం, ఆక్సిజన్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు మెదడు కణాలు నిమిషాల వ్యవధిలోనే దెబ్బతినడం ప్రారంభిస్తాయి. దీనివల్ల శరీరంలోని వివిధ విధులపై ప్రభావం పడుతుంది. పక్షవాతంలో ప్రధానంగా రెండు రకాలున్నాయి. అందులో ఒకటి ఇస్కీమిక్ స్ట్రోక్. ఈ స్ట్రోక్ వచ్చిన వెంటనే రక్తం గడ్డకట్టడం వల్ల మెదడుకు రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళం మూసుకుపోతుంది. రెండోది హేమరేజిక్ స్ట్రోక్. ఇది వచ్చినప్పుడు రక్తనాళం చిట్లిపోవడం వల్ల మెదడులో రక్తస్రావం జరుగుతుంది. దీంతో వెంటనే పక్షవాతం వస్తుందని వైద్యులు చెబుతున్నారు. ఈ రెండు పరిస్థితులూ ప్రమాదకరమైనవే. వీటికి తక్షణ వైద్య చికిత్స అందించాల్సిన అవసరం ఉంది.

మొదటి నాలుగున్నర గంటలు కీలకం

పక్షవాతం లక్షణాలు మొదలైన తర్వాత చికిత్సలో జరిగే ప్రతి నిమిషం ఆలస్యం మెదడులోని లక్షలాది కణాలను దెబ్బతీసే ప్రమాదం ఉంది. ముఖ్యంగా తొలి నాలుగున్నర గంటలు అత్యంత కీలకమైనవి. ఈ సమయంలో అర్హులైన రోగులకు రక్తం గడ్డలను కరిగించే మందులు అందించవచ్చు. దీని వల్ల రోగి కోలుకునే అవకాశాలు మెరుగుపడతాయి. అందుకే పక్షవాతం లక్షణాలు కనిపించిన వెంటనే సమయం వృథా చేయకుండా ఆసుపత్రికి తీసుకెళ్లాలి. అత్యవసర పరిస్థితులపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండటం అవసరం.

లైఫ్‌స్టైల్‌తో ముప్పును తగ్గించుకోవచ్చు

పక్షవాతం ముప్పును తగ్గించుకోవడానికి సమతుల్య ఆహారం తీసుకోవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, ఆరోగ్యకరమైన బరువును కొనసాగించడం ముఖ్యమైన చర్యలు. అలాగే మధుమేహాన్ని ముందుగానే గుర్తించడం, దానితో సంబంధం ఉన్న అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ సమస్యలకు సరైన చికిత్స తీసుకోవడం కూడా అంతే ముఖ్యం. యువతలో పెరుగుతున్న పక్షవాతం ప్రమాదాన్ని నిర్లక్ష్యం చేయకూడదు. వ్యాధి తొలి లక్షణాలను గుర్తించడం, సకాలంలో చికిత్స పొందడం ద్వారా ప్రాణాలను కాపాడుకోవచ్చు. పక్షవాతం విషయంలో ప్రతి నిమిషం విలువైనదేనని గుర్తుంచుకోవాలి.





ఆజబ్బులకు నిద్రే బెస్ట్ మెడిసిన్

నిద్రే నయం చేస్తోంది..

షుగర్, లేదా హార్ట్ ప్రాబ్లంతో బాధపడేవారు బయటపడే శుభవార్త చెప్పారు నిపుణులు. గాఢమైన నిద్రతో మెదడు పనితీరును మెరుగుపరుచుకోవచ్చని.. ఆ వ్యాధుల ఆ ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని పరిశోధకులు గుర్తించారు.

మీరు షుగర్, లేదా హార్ట్ ప్రాబ్లంతో బాధపడుతున్నారా..! లేదంటే మీ ఇంట్లో ఎవరైనా ఇదే జబ్బుల భారిన పడ్డారా! అయితే వీటి గురించి మీరు కానీ.. మీ ఫ్యామిలీ మెంబర్స్ కానీ వర్రీ కావాల్సిన అవసరం లేదంటున్నారు వైద్య నిపుణులు. ఆయా జబ్బులతో బాధపడేవారు బయటపడే శుభవార్త చెప్పారు. గాఢమైన నిద్రతో మెదడు పనితీరు ను మెరుగుపరుచుకోవచ్చని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఈ వ్యాధుల కారణంగా జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిసింది. అయితే వీటన్నిటికి నివారణ మార్గం మాత్రం ఒక్కటేనని చెప్పింది. ప్రశాంతంగా 6 నుంచి 8గంటల పాటు నిద్రపోవడం ద్వారా ఆ ప్రభావాన్ని కొంతవరకు తగ్గించుకోవచ్చని పరిశోధకులు(Sleep and Brain Health) గుర్తించారు. అంతేకాదు.. మంచి నిద్రతో మెదడు పరిమాణం కూడా మెరుగ్గా ఉంటున్నట్లు తేలింది. అంటే ఆరోగ్యకరమైన నిద్ర కేవలం శరీరానికే కాదు.. మెదడుకు కూడా ఎంతో మేలు చేస్తుందని చెప్తున్నారు.

నిద్రలేమీ..

మారుతున్న జీవనశైలిలో నిద్రకు ప్రాధాన్యత తగ్గిపోతోంది. అర్ధరాత్రి వరకు మేల్కొని ఉండటం.. సరైన నిద్ర లేకపోవడం చాలామందికి అలవాటుగా మారిపోయింది. అయితే ఈ అలవాట్లు ఆరోగ్యంపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని తాజా అధ్యయనం మరోసారి హెచ్చరిస్తోంది. ముఖ్యంగా మధుమేహం, గుండెజబ్బులు ఉన్నవారు నిద్ర నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని పరిశోధకులు సూచిస్తున్నారు. నిద్ర (Sleep and Brain Health) అలవాట్లను మెరుగుపరుచుకోవడం మెదడు ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో తోడ్పడుతుందని చెబుతున్నారు.

నిపుణుల పరిశోధన..

నిద్రకు, మెదడు ఆరోగ్యానికి మధ్య ఉన్న సంబంధాన్ని తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలు భారీ అధ్యయనం నిర్వహించారు. స్వీడన్‌లోని కరోలిన్‌స్కా ఇన్‌స్టిట్యూట్ పరిశోధకులు సహా పలువురు శాస్త్రవేత్తలు యూకే బయోబ్యాంక్‌కు చెందిన 4లక్షల మందికి పైగా ఆరోగ్య సమాచారాన్ని విశ్లేషించారు. వీరిలో 54 వేల మందికి పైగా గుండె, జీవక్రియ సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నవారున్నారు. నిద్ర వ్యవధి, జీవగడియారం, నిద్రలేమి, గురక, పగటిపూట నిద్ర మత్తు వంటి ఐదు అంశాలను పరిగణనలోకి తీసుకున్నారు. అంతేకాదు.. సుమారు 35 వేల మందికి సంబంధించిన మెదడు ఎంఆర్ఐ స్కాన్లను కూడా పరిశీలించారు. నాణ్యమైన నిద్రతో మెదడు పనితీరులో సానుకూల మార్పులు వస్తున్నట్లు పరిశోధకులు గుర్తించారు. చక్కగా నిద్రపోయేవారిలో జ్ఞాపకశక్తి మెరుగ్గా ఉండటంతో పాటు.. సమస్యలను పరిష్కరించే సామర్థ్యం, సమాచారాన్ని వేగంగా అర్థం చేసుకునే నైపుణ్యం కూడా ఎక్కువగా ఉన్నట్లు తేలింది. ముఖ్యంగా షుగర్, హార్ట్ ఎటాక్, పక్షవాతం వంటి సమస్యలున్న వారిలో ఈ ప్రభావం మరింత స్పష్టంగా కనిపించడం విశేషం.



మధుమేహంతో అల్జీమర్స్

టైప్-2 మధుమేహంతో బాధపడేవారిలో అల్జీమర్స్ వ్యాధి ముప్పు ఇతరులతో పోలిస్తే 53 శాతం అధికంగా ఉంటుందని ఓ అధ్యయన సమీక్ష వెల్లడించింది. ఆస్ట్రేలియాలోని కర్టిన్ విశ్వవిద్యాలయ పరిశోధకుల నేతృత్వంలో 40 అధ్యయనాలను విశ్లేషించి ఈ అంచనాకు వచ్చారు. ఈ వివరాలు 'అల్జీమర్స్ రీసెర్చ్ అండ్ థెరపీ' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి. టైప్-2 మధుమేహం ఉన్న ప్రతి వెయ్యి మందిని ఏడాది పాటు పరిశీలిస్తే సగటున 4.7 మందికి అల్జీమర్స్ వచ్చే అవకాశం ఉందని పరిశోధకులు గుర్తించారు. ఈ వ్యాధి కారణంగా జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం క్రమంగా క్షీణిస్తాయి. గతంలో జరిగిన సమీక్షలు వివిధ రకాల మధుమేహం, చిత్తవైకల్య సమస్యలను కలిపి పరిశీలించగా.. తాజా అధ్యయనం ప్రత్యేకంగా టైప్-2 మధుమేహం, అల్జీమర్స్ మధ్య సంబంధాన్ని విశ్లేషించింది. మధుమేహ చికిత్సలో భాగంగా మెదడు పనితీరు, జ్ఞాపకశక్తికి సంబంధించిన ఆరోగ్య ప్రమాదాల నివారణపైనా దృష్టి పెట్టాలని పరిశోధకులు సూచించారు. ఏప్రిల్, 2026 వరకు ప్రచురితమైన పరిశోధనలను పరిశీలించి, మొత్తం 2.71 కోట్లకు పైగా డేటా పాయింట్లను విశ్లేషించినట్లు వెల్లడించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 14.11.2026
www.mudranews.in | @mudranews

శరీరంలో వాపులు తగ్గించడంలో తోడ్పాటు!

చింతచిగురులో ఉండే పాలీఫినాల్స్, ఇతర యాంటీఆక్సిడెంట్ సమ్మేళనాలు శరీరంలో ఆక్సిడేటివ్ ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడవచ్చు.



ఆర్టీసీలో మహిళలకు భారీ రాయితీ

15 రోజుల ఛార్జీతో నెలరోజుల బస్ ప్రయాణం
ఎంఎస్‌టీ పాస్‌లపై టీజీఎస్ ఆర్టీసీ తొమ్మిది ప్రత్యేక సౌకర్యాలు

ముద్ర, హైదరాబాద్, నవంబర్ 13: నిత్యం బస్సుల్లో ప్రయాణించే మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) శుభవార్త అందించింది. నెలవారీ సీజన్ టికెట్ల (ఎంఎస్‌టీ)పై తొమ్మిది ప్రత్యేక రాయితీలు, అదనపు సౌకర్యాలను ప్రకటించింది. ఈ నూతన విధానం నవంబర్ 14 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి రానుంది. ముఖ్యంగా మహిళలు కేవలం 15 రోజుల ఛార్జీ చెల్లించి నెలరోజుల పాటు ప్రయాణించే వెసులుబాటు కల్పించడం ఈ నిర్ణయంలో ప్రధాన ఆకర్షణగా నిలిచింది.

దూర పరిమితి తొలగింపు

ఎంఎస్‌టీ పాస్‌ల జారీకి ఇప్పటివరకు అమల్లో ఉన్న దూర పరిమితిని ఆర్టీసీ తొలగించింది. నిర్దేశిత రూట్, ఛార్జీల నిబంధనలకు అనుగుణంగా ఎంత దూరానికైనా నెలవారీ పాస్ పొందవచ్చు. పాస్ ధరను తగ్గించే ఉద్దేశంతో టోల్ ప్లాజా ఛార్జీలను 25 రోజులకు బదులుగా 20 రోజులకు మాత్రమే లెక్కించనున్నారు. సాధారణ ప్రయాణికుల కోసం కొత్తగా డీలక్స్ ఎంఎస్‌టీని ప్రవేశపెడుతున్నారు. ఈ పాస్‌తో ఇ-డీలక్స్ బస్సుల్లోనూ ప్రయాణించవచ్చు. ఆదివారాల్లో ఉచిత ప్రయాణంహైదరాబాద్, వరంగల్, నిజామాబాద్, సల్గొండ, కరీంనగర్ నగరాల్లో నడిచే అన్ని కేటగిరీల సిటీ బస్సుల్లో ఎంఎస్‌టీ పాస్‌దారులు ఆదివారాల్లో ఉచితంగా ప్రయాణించవచ్చు. అయితే గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పుష్పక్ ఎయిర్‌పోర్ట్ లైనర్ సర్వీసులకు, ఇతర ప్రభుత్వ సెలవు దినాల్లో ఈ సౌకర్యం వర్తించదు.



రూ.20తో కాంబి టికెట్

ప్రయాణానికి అదనంగా రూ.20 చెల్లించి కాంబి టికెట్ తీసుకుంటే పల్లెవెలుగు ఎంఎస్‌టీ పాస్‌దారులు ఎక్స్‌ప్రెస్, ఇ-ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించవచ్చు. అలాగే ఎక్స్‌ప్రెస్ ఎంఎస్‌టీ పాస్‌దారులు డీలక్స్, ఇ-డీలక్స్ బస్సుల్లోనూ ప్రయాణించే అవకాశం కల్పించారు. అయితే పల్లెవెలుగు పాస్‌తో డీలక్స్, ఇ-డీలక్స్ బస్సుల్లో ప్రయాణించడానికి అనుమతి ఉండదు.

ఇతర మార్గాల్లోనూ రాయితీ

తమకు కేటాయించిన మార్గం కాకుండా రాష్ట్రంలోని ఇతర రూట్లలో ప్రయాణించే ఎంఎస్‌టీ పాస్‌దారులకు సూపర్ లగ్జరీ, ఆపై స్థాయి బస్సుల బేసిక్ టికెట్ ఛార్జీపై 10 శాతం రాయితీ కల్పించనున్నారు.

దీర్ఘకాలిక పాస్‌లకు అదనపు గడువు

రెండు నెలల ఎంఎస్‌టీ కొనుగోలు చేసేవారికి అదనపు రుసుము లేకుండా మరో ఐదు రోజుల వ్యాలిడిటీ లభిస్తుంది. మూడు నెలల పాస్ తీసుకునేవారికి అదనంగా పది రోజుల గడువు కల్పించనున్నారు.మహిళలకు ప్రత్యేక రాయితీమహిళా ప్రయాణికులకు మరింత ప్రయోజనం కలిగించేలా ప్రత్యేక రాయితీ ప్రకటించారు. టోల్ ఛార్జీలతో సహా నెలవారీ ఎంఎస్‌టీ ఛార్జీలను 20 రోజులకు బదులుగా కేవలం 15 రోజులకు మాత్రమే లెక్కించనున్నారు. దీంతో మహిళలు తక్కువ మొత్తంతో నెలరోజుల ప్రయాణ సౌకర్యాన్ని పొందవచ్చు. 'టీజీఎస్ ఆర్టీసీతో ప్రయాణించండి.. మరింత ఆదా చేయండి' అనే నినాదంతో ఈ సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు సంస్థ వెల్లడించింది. మహిళలు, విద్యార్థులు, ఉద్యోగులు, నిత్య ప్రయాణికులు ఈ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్టీసీ యాజమాన్యం కోరింది.

సీఎం ప్రజావాణికి 127 దరఖాస్తులు

గద్వాల విజయలక్ష్మి చొరవతో ఇద్దరు బాలికలకు విద్యా సర్టిఫికెట్లు అందజేత

ముద్ర, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబా ఫూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన 269వ సీఎం ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 127 దరఖాస్తులు అందాయి. సీఎం ప్రజావాణి రాష్ట్ర స్థాయి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్‌పర్సన్ గద్వాల విజయలక్ష్మి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించి, సంబంధిత అధికారులకు ఎండార్స్‌మెంట్లు చేశారు. పలు సమస్యల పరిష్కారంపై అధికారులతో ఫోన్‌లో మాట్లాడి తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ శాఖకు సంబంధించి 44, బీసీ సంక్షేమ శాఖకు 13, మున్సిపల్ శాఖకు 14, ఇతర శాఖలకు సంబంధించి 56 దరఖాస్తులు అందాయి. కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారి కె. విద్యాసాగర్, డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.సీఎం ప్రజావాణి చొరవతో ఇద్దరు బాలికలకు న్యాయంసీఎం ప్రజావాణి ద్వారా అందిన ఫిర్యాదుకు స్పందించిన అధికారులు ఇద్దరు మైనర్ విద్యార్థినులకు న్యాయం చేశారు. ఫీజులు చెల్లించిన ప్పటికీ విద్యా ధ్రువపత్రాలు ఇవ్వకుండా నిలిపివేసిన నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్ యాజమాన్యం నుంచి వాటిని సేకరించి శుక్రవారం ప్రజావాణి కార్యక్రమంలో బాలికలకు అందజేశారు.ఘట్కేసర్ మండలం నారపల్లిలోని నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్‌లో చదివిన ఉషాశ్రీ (10వ తరగతి), ఊర్జిత (7వ తరగతి) తమకు అవసరమైన అకడమిక్ సర్టిఫికెట్లు పాఠశాల యాజమాన్యం ఇవ్వడం లేదని గతంలో సీఎం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీంతో తమ తదుపరి చదువును కొనసాగించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని గద్వాల విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లారు.విద్యార్థినుల సమస్యపై స్పందించిన గద్వాల విజయలక్ష్మి వెంటనే స్కూల్ ఎడ్యుకేషన్ ఆర్జేడీ సోమిరెడ్డితో ఫోన్‌లో మాట్లాడి అవసరమైన సర్టిఫికెట్లను తక్షణమే అందించాలని ఆదేశించారు. ఈ విషయంపై విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణాకు సైతం అధికారికంగా లేఖ రాసి చర్యలు తీసుకోవాలని కోరారు.దీంతో స్పందించిన విద్యాశాఖ ఆర్జేడీ నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్‌కు వెళ్లి విద్యార్థినులకు సంబంధించిన ట్రాన్స్‌ఫర్ సర్టిఫికెట్లు (టీసీ), బోనఫైడ్, కండక్ట్, మైగ్రేషన్ సర్టిఫికెట్లతో పాటు మార్కుల మెమోలను సేకరించారు. వాటిని శుక్రవారం సీఎం ప్రజావాణిలో గద్వాల విజయలక్ష్మికి అందజేయగా, ఆమె స్వయంగా విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందించారు.దీంతో తమ చదువుకు ఎదురైన అడ్డంకి తొలగిపోవడంతో బాలికలు, వారి కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడుకునే హక్కు ఏ విద్యాసంస్థకూ లేదని స్పష్టం చేశారు. ఫీజులు, ఇతర పరిపాలనా కారణాలతో విద్యార్థుల సర్టిఫికెట్లను నిలిపివేసి వారి చదువుకు ఆటంకం కలిగించడం సరికాదన్నారు.ప్రతి విద్యార్థికి విద్యను కొనసాగించే అవకాశం కల్పించాలని, చిన్నారుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యాసంస్థలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా విద్యాశాఖ అధికారులు పర్యవేక్షించాలని, విద్యార్థుల హక్కులకు భంగం కలిగించే చర్యలను ప్రభుత్వం ఉపేక్షించదని హెచ్చరించారు.



నిర్మాణ రంగంలోనూ శుద్ధి జలాల వినియోగానికి శ్రీకారం

మల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలో తొలిసారిగా ఎస్టీపీ నీటి వినియోగం
గ్రీన్ వాటర్ ట్యాంకర్లను ప్రారంభించిన కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి
శుద్ధి జలాల వినియోగానికి ముందుకొచ్చిన తొలి సంస్థగా వాసవి గ్రూప్
ఎస్టీపీల నుంచి రోజుకు 56 లక్షల లీటర్ల నీరు అందుబాటులోకి

ముద్ర, మల్కాజిగిరి, నవంబర్ 13: తాగునీటి సంరక్షణ, భూగర్భ జలాల పరిరక్షణతో పాటు శుద్ధి చేసిన నీటి పునర్వినియోగాన్ని ప్రోత్సహించే దిశగా జలమండలి మరో కీలక ముందడుగు వేసింది. ఇప్పటివరకు నిర్మాణ రంగంలో విస్తృతంగా వినియోగిస్తున్న తాగునీరు, భూగర్భ జలాలకు ప్రత్యామ్నాయంగా మురుగునీటి శుద్ధి కేంద్రాల (ఎస్టీపీ) ద్వారా శుద్ధి చేసిన నీటిని వినియోగించే కార్యక్రమానికి మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) పరిధిలో శ్రీకారం చుట్టింది. వాసవి ఆనంద నిలయం నిర్మాణ ప్రాంగణంలో శుక్రవారం ఎంఎంసీ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి గ్రీన్ వాటర్ ట్యాంకర్లను ప్రారంభించారు. నిర్మాణ పనుల్లో శుద్ధి జలాలను వినియోగించేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చిన తొలి సంస్థగా వాసవి గ్రూప్ నిలిచింది.ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రాబోయే వేసవిలో నీటి కొరతను దృష్టిలో ఉంచుకుని నిర్మాణ రంగంలో తాగునీరు, భూగర్భ జలాల వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. కాంక్రీట్ నిర్మాణాలు, ఇతర పనులకు టెర్షియరీ శుద్ధి చేసిన నీటిని వినియోగించాలని నిర్మాణ సంస్థలకు పిలుపునిచ్చారు. ఈ విధానాన్ని అన్ని నిర్మాణ సంస్థలు అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. నీటి సంరక్షణకు ముందుకొచ్చిన వాసవి గ్రూప్‌ను అభినందించారు.జలమండలి మల్కాజిగిరి రీజియన్ ఈడీ ఎస్. పంకజ మాట్లాడుతూ నిర్మాణ ప్రాంగణాల్లో కాంక్రీట్ క్యూరింగ్, దుమ్ము నియంత్రణ, ప్రాంగణాల శుభ్రత వంటి అవసరాలకు మాత్రమే శుద్ధి జలాలను వినియోగించాలని సూచించారు. నీటి వినియోగాన్ని పర్యవేక్షించేందుకు ఎంఎంసీ ఏసీపీలు, జలమండలి డీజీఎంలతో సంయుక్త బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.మూడు ఎస్టీపీల నుంచి రోజుకు 56 లక్షల లీటర్లుమల్కాజిగిరి కార్పొరేషన్ పరిధిలోని సరూర్‌నగర్, పటేల్ చెరువు, సఫిల్‌గూడ మురుగునీటి శుద్ధి కేంద్రాల నుంచి రోజుకు మొత్తం 5.60 ఎంఎల్‌డీ (56 లక్షల లీటర్లు) టెర్షియరీ శుద్ధి జలాలు అందుబాటులో ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇందులో సరూర్‌నగర్, పటేల్ చెరువు ఎస్టీపీల నుంచి రోజుకు 2.50 ఎంఎల్‌డీ చొప్పున, సఫిల్‌గూడ ఎస్టీపీ నుంచి 0.60 ఎంఎల్‌డీ నీరు అందుబాటులో ఉంటుందని వివరించారు.ఈ శుద్ధి జలాలను జలమండలి ఉచితంగా అందిస్తుందని, వినియోగదారులు రవాణా ఖర్చులు మాత్రమే చెల్లించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. నిర్మాణ సంస్థలు తమ వాటర్ ట్యాంకర్లను గ్రీన్ వాటర్ ట్యాంకర్లుగా నమోదు చేసుకోవచ్చని, లేదా డయల్ –ఎ–గ్రీన్ ట్యాంకర్ సేవ ద్వారా నీటిని బుక్ చేసుకోవచ్చని సూచించారు. ఈ సేవలకు సంబంధించిన మరిన్ని వివరాల కోసం 155313 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో జలమండలి డైరెక్టర్ బి. నారాయణ, ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ వికాస్ మహతో, ఎంఎంసీ, జలమండలి అధికారులు, వాసవి గ్రూప్ ప్రతినిధులు పాల్గొన్నారు.



సాహెబ్‌నగర్‌లో విద్యాభివృద్ధికి రూ.85 లక్షలు

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి శంకుస్థాపన

ముద్ర ప్రతినిధి, ఎల్.బి.నగర్: సాహెబ్ నగర్‌లో విద్యాభివృద్ధికి రూ.85 లక్షలతో నూతన నిర్మాణ పనులకు ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ.దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు శంకుస్థాపన.బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాహెబ్ నగర్‌లో త్రినేత్ర ఆంజనేయ స్వామి దేవాలయం సమీపంలోని ప్రభుత్వ పాఠశాలలో సుమారు రూ.85 లక్షల నిధులతో నూతన అంగన్వాడీ భవనం మరియు ప్రాథమిక పాఠశాలకు అదనపు గదుల నిర్మాణ పనులకు శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎల్.బి.నగర్ శాసనసభ్యులు శ్రీ దేవిరెడ్డి సుధీర్ రెడ్డి గారు పాల్గొని నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి గారు మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా అభివృద్ధి పనులకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. చిన్నారులకు అంగన్వాడీ స్థాయి నుంచే మెరుగైన వసతులు కల్పించడంతో పాటు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అదనపు తరగతి గదులను నిర్మించడం ద్వారా విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరచవచ్చని పేర్కొన్నారు.ఇట్టి కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి.నగర్ డివిజన్ భారస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి,మనోజ్,సతీష్ చౌదరి,మహేష్,శ్రీకాంత్ రెడ్డి,సంతోష్ రావు, నరేష్, రాజు యాదవ్,స్కూల్ ప్రిన్సిపాల్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.



రేవంత్‌ది ప్రజా పాలన కాదు.. రియల్ ఎస్టేట్ దందా

హరీష్ రావు ధ్వజం

మూసాపేట ట్రక్ పార్కింగ్ భూముల వేలాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్

బిడ్‌లలో పాల్గొంటే ఊరుకోం..

అధికారంలోకి వచ్చాక వెనక్కి తీసుకుంటామని హెచ్చరిక



ముద్ర, కూకట్‌పల్లి : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా పాలన పక్కనపెట్టి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత తన్నీరు హరీష్ రావు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కంట్లో ఏ ప్రభుత్వ భూమి పడినా దాన్ని అమ్మేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని ఆరోపించారు. కూకట్‌పల్లి, మూసాపేట పరిధిలోని ప్రజా ప్రయోజనాల కోసం కేటాయించిన విలువైన ట్రక్ పార్కింగ్ భూములను హెచ్ఎండీఏ ద్వారా వేలం వేయడాన్ని ఆయన తీవ్రంగా ఆక్షేపించారు.శుక్రవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సీపీఎం, సీపీఐ నేతలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో హరీష్ రావు మాట్లాడారు.10 ఏళ్లలో కాపాడిన భూములను అమ్మేస్తున్నారు2013లో ఉమ్మడి రాష్ట్రంలో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ భూములను అమ్మకానికి పెడితే వామపక్షాలు, బీఆర్ఎస్ కలిసి పోరాడి అడ్డుకున్నాయని హరీష్ రావు గుర్తుచేశారు. "గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఈ ప్రాంతంలో ఒక్క గజం భూమి కూడా అమ్మలేదు. ప్రజోపయోగ పనుల కోసం నర్సరీ, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్, ఏసీపీ కార్యాలయం, ఆర్టీవో ఆఫీస్, ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ ఏర్పాటు చేశాం. ఇప్పుడు రేవంత్ సర్కార్ వీటన్నింటినీ కూల్చేసి, భూములను వేలం వేయాలని చూస్తోంది" అని మండిపడ్డారు.లక్ష కోట్ల విలువైన ఆస్తుల అమ్మకానికి కుట్రరాష్ట్రవ్యాప్తంగా దాదాపు లక్ష కోట్ల రూపాయల విలువైన ఆస్తులను కాంగ్రెస్ ప్రభుత్వం విక్రయించేందుకు సిద్ధమైందని హరీష్ రావు ఆరోపించారు. ఇప్పటికే వేలాది కోట్ల భూములు అమ్మేశారని, హెచ్‌సీయూ, హెచ్ఎండీఏ భూములను స్టాక్ ఎక్స్ఛేంజ్‌లలో తాకట్టు పెట్టి అప్పులు తెస్తున్నారని విమర్శించారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు "భూములు జాతి సంపద.. వాటిని అమ్మితే బొందలు పెట్టడానికి కూడా స్థలం ఉండదు" అని మాట్లాడిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు అధికారంలోకి రాగానే రంగులు మార్చి ఊసరవెల్లిలా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు.చట్టాన్ని ఉల్లంఘిస్తే జైలు తప్పదు: అధికారులకు హెచ్చరిక1982లో నాటి హుడా అర్బన్ డెవలప్‌మెంట్ చట్టం ప్రకారం రైతుల నుంచి సేకరించిన భూమిని ప్రజా ప్రయోజనాల కోసమే వాడాలని, ఎలాంటి వాణిజ్య, నివాస సముదాయాల కోసం అమ్మరాదని స్పష్టమైన నిబంధనలు ఉన్నాయని పేర్కొన్నారు. కోర్టుల్లో ఇచ్చిన అఫిడవిట్లకు విరుద్ధంగా అధికారులు వేలం ప్రక్రియ చేపడితే చట్టపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.వేలంలో పాల్గొనేవారికి హెచ్చరికఈ భూములు కొనేందుకు వేలంలో ఎవరూ పాల్గొనవద్దు. రేపు అధికారంలోకి వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమే. నిబంధనలకు విరుద్ధంగా కొనుగోలు చేసే భూములకు ఎలాంటి అనుమతులు రావు, ప్రజా అవసరాల కోసం ఆ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుంది" అని హరీష్ రావు స్పష్టం చేశారు. మూసాపేట ట్రక్ పార్కింగ్ భూముల వేలాన్ని తక్షణమే రద్దు చేయాలని, లేనిపక్షంలో వామపక్షాలతో కలిసి ప్రత్యక్ష పోరాటానికి దిగుతామని ఆయన హెచ్చరించారు.

రోడ్డు డైవర్షన్ పనుల పరిశీలన



ముద్ర, శేరిలింగంపల్లి : నియోజకవర్గంలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పీయేసీ చైర్మన్ ఆరెక పూడి గాంధీ పరిశీలించారు. సీఎంసీ కమిషనర్ సృజన, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మలెంపాటి, డీసీ లు శ్రీనివాస్, బాలకృష్ణ, సిసిపీ వెంకన్న, ప్రాజెక్ట్స్, టౌన్ ప్లానింగ్ విభాగం అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రాజెక్టులో భాగంగా ఆల్విన్ చౌరస్తా నుండి హఫీజ్‌పేట్ రైల్వే ఓవర్ బ్రిడ్జి వరకు ప్రతిపాదించిన 200 అడుగుల రహదారి నిర్మాణం వల్ల ప్రభావితమయ్యే ఆస్తులను కూడా అధికారులు పరిశీలించారు. ప్రతిపాదిత రహదారి వెడల్పును 200 అడుగుల నుంచి 160 అడుగులకు తగ్గించే అంశంపై సాధ్య సాధ్యుల పై చర్చించడం జరిగినది అని చైర్మన్ గాంధీ తెలియచేశారు.సవరించిన రహదారి అలైన్‌మెంట్ ప్రకారం టౌన్ ప్లానింగ్ మరియు ఇంజినీరింగ్ విభాగాల అధికారులు సంయుక్తంగా సర్వే నిర్వహించి, ప్రభావిత ఆస్తుల యజమానులకు నవంబర్ 15, 2026 లోపు నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు.అదేవిధంగా, ప్రతిపాదిత మౌలిక సదుపాయాల పనులను త్వరితగతిన చేపట్టేందుకు వి యు పి భాగం వరకు భూసేకరణ ప్రక్రియను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని చైర్మన్ గాంధీ అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్స్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు సీఈ శ్రీలక్ష్మి , ఈఈ గోపాల్ డీఈ వరుణ్, టౌన్ ప్లానింగ్ ఎసిపి సుష్మా , డీఈ శ్రీదేవి ,ఏఈ ప్రతాప్ మరియు నాయకులు,కార్యకర్తలు ఇంద్రారెడ్డి రెడ్డి ఆల్విన్ కాలనీ వాసులు ,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా 24వ మహా పడిపూజ



ముద్ర, కూకట్‌పల్లి : కోలన్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి 24వ మహా పడిపూజ కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో, అంగరంగ వైభవంగా జరిగింది. నిజాంపేట్ గ్రామంలోని హిల్ కౌంటి (మైదాస్) విల్లా నంబర్ 90లోని కోలన్ నరసింహా రెడ్డి (లీడర్) స్వగృహంలో ఈ వేడుకను ఘనంగా నిర్వహించారు.మాన్యశ్రీ అరుణ్ గురు స్వామి కరకమలములచే శాస్త్రోక్తంగా పడిపూజ నిర్వహించగా, జడల రమేష్ బృందం ఆలపించిన భజనలు, అయ్యప్ప నామస్మరణలతో నిజాంపేట్ ప్రాంతం మారుమోగింది.ఈ ఆధ్యాత్మిక కార్యక్రమానికి పటాన్చెరు ఎమ్మెల్యే, స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, కార్పొరేటర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వీరితో పాటు అయ్యప్ప స్వామి భక్తులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులు భారీ సంఖ్యలో తరలివచ్చి పూజా కార్యక్రమాన్ని తిలకించారు. అనంతరం భక్తులందరూ అయ్యప్ప స్వామి తీర్థ ప్రసాదాలు, అన్న ప్రసాదాన్ని స్వీకరించి స్వామి వారి కృపకు పాత్రులయ్యారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 14.11.2026
www.mudranews.in | @mudranews

చింతచిగురును పచ్చిగా, ఎండబెట్టి కూడా తినొచ్చు

చింతచిగురును పచ్చడిగా, పప్పులో, కూరల్లో వేసుకుని తినవచ్చు. సీజన్‌లో సేకరించిన చిగురులను శుభ్రంగా కడిగి ఎండబెట్టి పొడిగా చేసుకుని కూడా వంటల్లో ఉపయోగించవచ్చు.



ఘోర ప్రమాదం..

కజిరంగా సమీపంలో ఘోర ప్రమాదం.. 23 మంది మృతి
బస్సు-ట్రక్కు ఢీ.. నుజ్జునుజ్జైన మినీ బస్సు

ముద్ర, కోల్ కతా : అస్సాంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ప్రఖ్యాత కజిరంగా నేషనల్ పార్క్ సమీపంలో ఓ మినీ బస్సు, కంటైనర్ ట్రక్కు ఢీకొన్నాయి. ఈ ఘటనలో 23 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో పలువురు విద్యార్థులు ఉన్నట్లు సమాచారం. బోకాఖాత్ నుంచి నాగావ్ వెళ్తున్న మినీ బస్సు.. పార్క్ సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రక్కును ఢీకొట్టింది. ప్రమాద తీవ్రతకు మినీ బస్సు నుజ్జునుజ్జయ్యింది. దీంతో చాలా మంది ప్రయాణికులు అందులో చిక్కుకుని మరణించారు. సమాచారం అందుకున్న అస్సాం పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సమయంలో బస్సులో ఎంతమంది ఉన్నారనే దానిపై స్పష్టతలేదు. ఘటనాస్థలంలోనే 15 మంది ప్రాణాలు కోల్పోగా.. ఆసుపత్రికి తరలించేలోపే మరికొందరు మరణించినట్లు పోలీసులు వెల్లడించారు. మృతుల సంఖ్యపై ఇంకా స్పష్టమైన సమాచారం రాలేదు. నిబంధనలను ఉల్లంఘించి పార్క్ సమీపంలో బస్సు అతి వేగంతో వెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలోనే డ్రైవర్ నియంత్రణ కోల్పోయి ట్రక్కును ఢీకొట్టి ఉంటాడని భావిస్తున్నారు.

భూగర్భ జలాల పరిరక్షణకు రాష్ట్రవ్యాప్త కార్యాచరణ

ముద్ర, హైదరాబాద్: ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలపై ఒత్తిడి పెరిగే అవకాశం ఉన్నందున రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర జల సంరక్షణ కార్యాచరణ ప్రణాళిక రూపొందిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. యాసంగికి ముందే నీటి లభ్యతను శాస్త్రీయంగా అంచనా వేసి, వాటర్‌షెడ్‌ల వారీగా నీటి నిల్వలు, సాగు అవసరాలను గుర్తించాలని సూచించారు. నీటి లెక్కలు, వినియోగం, పర్యవేక్షణ కోసం ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ప్రొఫెసర్ వీరేంద్ర తివారీ ప్రతిపాదించారు. నీటి లభ్యతను బట్టి వరి, మొక్కజొన్న, చిరుధాన్యాల సాగుపై రైతులకు మార్గనిర్దేశం చేయాలని సూచించారు. వర్షపు నీటి సేకరణ, భూగర్భ జలాల పెంపు, నీటి వినియోగ నియంత్రణకు ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు.



ఆంధ్రప్రదేశ్‌ను బీజేపీ ప్రభుత్వం ప్రయోగశాలగా మారుస్తోందా?

ముద్ర, ఆంధ్రప్రదేశ్: ఆంధ్రప్రదేశ్‌ను కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రయోగశాలగా మారుస్తోందా? అంటూ సీపీఐ నేత కే. నారాయణ ప్రశ్నించారు. రాష్ట్రంలో రాత్రి కోర్టుల నిర్వహణ ప్రతిపాదనను ఆయన వ్యతిరేకించారు. ప్రజలకు సత్వర న్యాయం అందించాలంటే ముందుగా న్యాయవ్యవస్థలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని సూచించారు. జిల్లా, సబార్డినేట్ కోర్టుల్లో 875 న్యాయమూర్తుల పోస్టులకు గాను 137 ఖాళీగా ఉన్నాయని తెలిపారు. కోర్టు సిబ్బంది కొరత కూడా తీవ్రంగా ఉందన్నారు. ఉద్యోగుల పదవీ విరమణ తేదీలు ముందుగానే తెలిసే అవకాశం ఉన్నందున, రాబోయే ఖాళీలను ముందస్తు ప్రణాళికతో భర్తీ చేయడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులతో రాత్రి కోర్టులు నిర్వహించడం, ఉన్న సిబ్బందిపై అదనపు భారం మోపడం సరైన విధానం కాదని నారాయణ విమర్శించారు.

టీటీడీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 కోట్ల విరాళం

హైదరాబాద్‌కు చెందిన భక్తుడు కొడాలి శ్రీకాంత్ భారీ విరాళం

ముద్ర, హైదరాబాద్ : తిరుమల, నవంబర్ 13: తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) నిర్వహిస్తున్న శ్రీ వేంకటేశ్వర అన్నప్రసాదం ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన భక్తుడు కొడాలి శ్రీకాంత్ రూ.10 కోట్ల విరాళం అందించారు. శుక్రవారం తిరుమల శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో టీటీడీ అదనపు ఈవో సీహెచ్ వెంకయ్య చౌదరికి విరాళానికి సంబంధించిన చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా దాత కొడాలి శ్రీకాంత్‌ను అదనపు ఈవో అభినందించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చీఫ్ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ ఆఫీసర్ (సీవీఎస్వో) మురళీకృష్ణ పాల్గొన్నారు.



కాళోజీకి సీఎం రేవంత్ రెడ్డి ఘన నివాళులు

ముద్ర, తెలంగాణ బ్యూరో: ప్రజాకవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘన నివాళులర్పించారు. తెలంగాణ ప్రజల జీవన విధానం, ఆకాంక్షలు, ఆవేదనలను తన రచనల్లో ప్రతిబింబించిన మహనీయుడని కొనియాడారు. సామాజిక అన్యాయాలు, అసమానతలపై తన కలం ద్వారా పోరాడి ప్రజల్లో చైతన్యం నింపారని పేర్కొన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతికి విశిష్ట గుర్తింపు తీసుకొచ్చిన కాళోజీ ఆశయాలు, ఆలోచనలు భావితరాలకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయని సీఎం తెలిపారు.

నాగుల చవితి వేళ భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

నాగదేవతలకు పాలాభిషేకం.. సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు

బోడుప్పల్, ముద్ర: నాగుల చవితి సందర్భంగా బోడుప్పల్‌లోని పలు ఆలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు ఆలయా ల్లో దీపాలు వెలిగించి సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయా ఆలయాల్లో కొలువైన నాగదేవతల విగ్రహాలకు పాలతో అభిషేకం చేశారు. మల్లాపూర్ రోడ్డులోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయం, 40 అడుగుల రోడ్డులోని పార్వతి సమేత మల్లికార్జున స్వామి ఆలయం, నిమిషాంబిక మాత ఆలయం, ఆకృతి టౌన్‌షిప్‌లోని లక్ష్మీ గణపతి, కాశీ విశ్వేశ్వర ఆలయాల్లో భక్తులు నాగేంద్రుడిని పూజించారు.



తెలంగాణలో ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా

నవంబర్ 19 నుంచి 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా' నమోదు ప్రక్రియ ప్రారంభం

ముద్ర, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా కల్పించే లక్ష్యంతో తెలంగాణ ప్రభుత్వం 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' అమలుకు సిద్ధమైందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. ఈ పథకం కోసం నవంబర్ 19న మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారుల నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందని వెల్లడించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన భట్టి విక్రమార్క.. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా కల్పించాలని నిర్ణయించినట్లు చెప్పారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా ఉండాలన్నదే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని వివరించారు.

ఈ పథకం కింద ప్రతి కుటుంబంలోని ఒక సంపాదించే వ్యక్తికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పిస్తామని తెలిపారు. కులం, మతం, ఆదాయంతో సంబంధం లేకుండా



రాష్ట్రంలోని అన్ని కుటుంబాలూ అర్హులేనని స్పష్టం చేశారు. గతంలో అమలైన కొన్ని బీమా పథకాలు నిర్దిష్ట శాఖలు, వర్గాలకే పరిమితమయ్యాయని, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా మాత్రం అన్ని కుటుంబాలకూ వర్తించేలా రూపొందించామని పేర్కొన్నారు.

కుటుంబంలో ఒక్కరే సంపాదించే వ్యక్తి ఉంటే వారికే బీమా వర్తిస్తుందని, ఒకరి కంటే ఎక్కువ మంది సంపాదించే వ్యక్తులు ఉంటే వారిలో ఎవరికి బీమా కల్పించాలనేది కుటుంబమే నిర్ణయించుకోవచ్చని భట్టి తెలిపారు. బీమా మొత్తానికి ఒకరిని లేదా పలువురిని నామినీలుగా ఎంపిక చేసుకునే అవకాశం ఉంటుందని, ఒక్కో నామినీకి ఎంత శాతం చెల్లించాలనేది కూడా కుటుంబ సభ్యులే నిర్ణయించుకోవచ్చని వివరించారు. నవంబర్ 19 నుంచి గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ఏకకాలంలో విస్తృత స్థాయిలో నమోదు ప్రక్రియ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. బీమా పొందే వ్యక్తి పేరు, నామినీల వివరాలను నమోదు చేసే సమయంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. ఫారంలో వివరాలు నింపిన అనంతరం సదరు కుటుంబానికి వాటిని చదివి వినిపించి, అన్నీ సరిగ్గా ఉన్నాయని నిర్ధారించుకున్న తర్వాతే బీమా పొందే వ్యక్తి సంతకం తీసుకోవాలని స్పష్టం చేశారు. పథకంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు నవంబర్ 17, 18 తేదీల్లో గ్రామాల్లో టామ్‌టామ్ ద్వారా ప్రచారం నిర్వహించాలని సూచించారు. నమోదు కేంద్రాలు ఎక్కడ ఏర్పాటు చేస్తున్నారనే వివరాలను ముందుగానే ప్రజలకు తెలియజేయాలని, సామాజిక మాధ్యమాలతో పాటు అన్ని రకాల ప్రచార మాధ్యమాలను వినియోగించాలని అధికారులను ఆదేశించారు.

భారత్ సమ్మిట్‌తో యువతకు ఉపాధి అవకాశాలు

- ఎంపీ చామల
- అంతర్జాతీయ పెట్టుబడులు, స్థానిక అభివృద్ధికి భారత్ సమ్మిట్ వారధి
- 70 దేశాల నుంచి 1,000 మందికి పైగా ప్రతినిధుల హాజరు
- హైదరాబాద్–వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్, ఆర్ఆర్ఆర్‌తో భువనగిరికి ప్రయోజనం
- పోచంపల్లి చేనేత ఎగుమతులతోనూ ఉపాధి అవకాశాలు

ముద్ర, హైదరాబాద్ : 'భారత్ సమ్మిట్ 2026' అంతర్జాతీయ పెట్టుబడులకు, స్థానిక అభివృద్ధికి వారధిగా నిలుస్తుందని భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. హైదరాబాద్‌లోని హెచ్‌ఐసీసీ, హైటెక్స్ వేదికగా జరుగుతున్న ఈ సదస్సులో పాల్గొన్న ఆయన దీని ద్వారా భువనగిరి నియోజకవర్గ యువతకు భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 70 దేశాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులు హాజరవుతున్న ఈ సదస్సు కార్పొరేట్ పెట్టుబడులకు, సామాన్యుల సంక్షేమానికి మధ్య వారధిగా నిలుస్తోందని పేర్కొన్నారు. వచ్చే నెలలో జరగనున్న గ్లోబల్ సమ్మిట్ కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్ బాబు అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలతో చర్చలు జరుపుతున్నారని తెలిపారు. రేపు ఇదే వేదికపై రాహుల్ గాంధీ గిగ్ వర్కర్లు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి కానున్నారని వెల్లడించారు. హైదరాబాద్–వరంగల్ ఇండస్ట్రియల్ కారిడార్, రీజినల్ రింగ్ రోడ్డు పరిధిలో ఉన్న భువనగిరి నియోజకవర్గానికి ఐటీ, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ రంగాల పెట్టుబడులతో మంచి అవకాశాలు ఏర్పడతాయని చెప్పారు. పోచంపల్లి చేనేత ఉత్పత్తుల ఎగుమతుల ద్వారా కూడా స్థానిక యువతకు ఉపాధి లభిస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో పెంచే ఇలాంటి సదస్సులను రాజకీయ కోణంలో చూడకుండా ప్రతిపక్షాలు సహకరించాలని ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

పెట్టుబడులు పెట్టండి.. అన్ని విధాలా సహకరిస్తాం

తెలంగాణ అవకాశాల ఖని... పరిశ్రమల ఏర్పాటుకు అనుకూలం
పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలకు మంత్రి శ్రీధర్ బాబు ఆహ్వానం
భారత్ సమ్మిట్‌లో పలు కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశం

ముద్ర, హైదరాబాద్ : తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆహ్వానించారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు, వ్యాపార విస్తరణకు ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భరోసానిచ్చారు. శుక్రవారం హెచ్‌ఐసీసీలో జరుగుతున్న భారత్ సమ్మిట్–2026లో భాగంగా ఆయన ఇన్ఫ్రాస్ట్రక్చర్, ఎలక్ట్రానిక్స్, ఐటీ/ఐటీఈఎస్, మినరల్స్, ఈఎస్ డీఎం మాన్యుఫ్యాక్చరింగ్, టెలికాం, మొబైల్ మాన్యుఫ్యాక్చరింగ్, ఇంజినీరింగ్, అర్బన్ మొబిలిటీ, బ్యాటరీ సెల్ టెక్నాలజీ & ఎనర్జీ స్టోరేజ్, ట్రేడ్ ఫెసిలిటేషన్, సప్లై చైన్, ఫార్మాస్యూటికల్ మాన్యుఫాక్చరింగ్, వేస్ట్ టూ ఎనర్జీ తదితర రంగాలకు చెందిన పలు ప్రముఖ కంపెనీల ప్రతినిధులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వీరిలో టర్కీ, కెనడా, సౌత్ ఆఫ్రికా, యూకే, యూఎస్ఏ ప్రతినిధులు కూడా ఉన్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు, పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న విస్తృత అవకాశాలు, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అనుకూలమైన పారిశ్రామిక విధానాలను , వివిధ రంగాల్లో అందుబాటులో ఉన్న అవకాశాలను ఈ సందర్భంగా వారికి మంత్రి శ్రీధర్ బాబు వివరించారు.



ఎలక్ట్రానిక్స్, తయారీ, ఔషధాలు, క్లీన్ ఎనర్జీ, బ్యాటరీ స్టోరేజ్, అడ్వాన్స్డ్ మాన్యుఫ్యాక్చరింగ్, టెలికాం ఇంజినీరింగ్, ఫార్మా, ఐటీ/ఐటీఈఎస్ సహా వివిధ రంగాల్లో పెట్టుబడులకు రాష్ట్రం అన్ని రకాలుగా అనుకూలమన్నారు. రాష్ట్రంలో తమ వ్యాపార కార్యకలాపాలను ప్రారంభించడంతో పాటు ఇప్పటికే ఉన్న పరిశ్రమలను విస్తరించేందుకు ముందుకు రావాలని కోరారు. పెట్టుబడులను పరిశ్రమలుగా, పరిశ్రమలను ఉపాధి అవకాశాలుగా మార్చాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, ఇన్వెస్ట్ తెలంగాణ సీఈవో అజిత్ రెడ్డి, ఐటీ శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ గురించి మాట్లాడే స్థాయి కేటీఆర్‌కు లేదు

కేటీఆర్ వ్యాఖ్యలకు మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్

ముద్ర, హైదరాబాద్ : మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలకు తెలంగాణ మంత్రి పొన్నం ప్రభాకర్ కౌంటర్ ఇచ్చారు. రాహుల్ గాంధీ గురించి మాట్లాడేంత ఇమేజ్ కేటీఆర్‌కు లేదని విమర్శించారు. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్ పలు అంశాలను ప్రస్తావించారు. రాహుల్ గాంధీ కుటుంబం దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన కుటుంబమని పేర్కొన్నారు. నేరెళ్లలో దళితులపై దాడి, ఖమ్మంలో రైతులకు బేడీలు వేయడం, మల్లన్నసాగర్ నిర్వాసితులపై లాఠీచార్జి ఘటనలు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే జరిగాయని ప్రశ్నించారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఒక్క గ్రూప్–1 నోటిఫికేషన్ కూడా ఇవ్వలేదని ఆరోపించారు.తమ ప్రభుత్వం గ్రూప్–1 నోటిఫికేషన్ ఇచ్చి, పరీక్షలు నిర్వహించి చూపించిందన్నారు. హామీలు ఇవ్వడమే కాకుండా వాటిని అమలు చేసే సత్తా తమ ప్రభుత్వానికి ఉందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ పాలనలో వేల కోట్ల రూపాయల ఆస్తుల సంపాదనపై ఆసక్తి చూపారని విమర్శించిన పొన్నం.. తమ ప్రభుత్వానికి ప్రజా సంక్షేమమే ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.



అవినీతి గురించి కేటీఆర్ మాట్లాడటం విడ్డూరంగా ఉందని వ్యాఖ్యానించారు. ఫార్ములా ఈ-రేస్ కేసు ఆరోపణలతో పాటు కాళేశ్వరం ప్రాజెక్టు, విద్యుత్ కొనుగోళ్లు, అసైన్డ్ భూముల అంశాలను ప్రస్తావిస్తూ గత ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన ఆర్థాటాలకు, ప్రస్తుత ప్రజా ప్రభుత్వంలో జరుగుతున్న ఏర్పాట్లకు మధ్య తేడాను ప్రజలు గమనించాలని పొన్నం ప్రభాకర్ తన కౌంటర్ ట్వీట్‌లో పేర్కొన్నారు.

కూల్ డ్రింక్, చిప్స్ కంటే ఫోన్ రీచార్జ్ చీప్

నెలకు రూ.350 రీఛార్జ్ తప్పనిసరి కావాలి!
మొబైల్ టారిఫ్‌లు పెరగాల్సిందే.. ఎయిర్ టెల్ 'మిట్టల్' డిమాండ్!
రోజుకు రూ.10 ఖర్చు చేయలేరా?
5G పెట్టుబడులకు తగిన ఆదాయం రావడం లేదు

ముద్ర, ముంబై : భారతీ ఎయిర్‌టెల్ అధినేత సునీల్ భారతీ మిట్టల్ భారతదేశంలో మొబైల్ టారిఫ్‌లు మరింత పెరగాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం భారతదేశంలో రీఛార్జ్ ప్లాన్ల ధరలు చాలా తక్కువగా ఉన్నాయని, ఒక్కో వినియోగదారుడి నుంచి నెలకు సగటున కనీసం ₹350 ఆదాయం రావాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. అంటే రోజుకు సుమారు ₹10 నుంచి ₹12 వరకు ఒక్కో వినియోగదారుడి నుంచి టెలికాం కంపెనీలకు ఆదాయం రావాలన్నది ఆయన అభిప్రాయం. దేశవ్యాప్తంగా మొబైల్ నెట్‌వర్క్‌ను నిర్వహించడం, కొత్త టవర్ల నిర్మాణం, ఫైబర్ నెట్‌వర్క్ విస్తరణ, 5G సేవల అభివృద్ధి కోసం భారీగా పెట్టుబడులు అవసరమవుతున్నాయని మిట్టల్ పేర్కొన్నారు. టెలికాం రంగంలో పెట్టుబడులకు తగిన ప్రతిఫలం రావాలంటే మొబైల్ టారిఫ్‌లు పెరగాలని ఆయన అభిప్రాయపడ్డారు.నెలకు ₹350 అంటే రోజుకు సగటున ₹10 నుంచి ₹12 మాత్రమేనని, ఈ



మొత్తం పెద్ద భారం కాదని మిట్టల్ అభిప్రాయపడ్డారు. కూల్ డ్రింక్స్, చిప్స్ ధరల కంటే మొబైల్ రీఛార్జ్ ప్లాన్స్ ధరలే చీప్‌గా ఉన్నాయని భారతీ మిట్టల్ చెప్పుకొచ్చారు. బ్యాంకింగ్ సేవలు, UPI చెల్లింపులు, విద్య, ఆరోగ్య రికార్డులు, ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు, వినోదం వంటి అనేక సేవలకు మొబైల్ ఫోన్ ఉపయోగపడుతోందని పేర్కొన్నారు. ఆయన ప్రతిపాదిస్తున్న ₹350 సగటు ఆదాయం అనేది ₹200కు పైబడిన ఎంట్రీ స్థాయి ప్లాన్లు, ₹500, ₹700, ₹800, ₹1,000 వంటి అధిక ధరల ప్లాన్ల కలయికతో సాధ్యమవుతుందని వివరించారు.ఎయిర్‌టెల్ వెల్లడించిన గణాంకాల ప్రకారం.. 2026 సెప్టెంబర్ త్రైమాసికంలో ఒక్కో వినియోగదారుడి నుంచి నెలకు సగటున 271 రూపాయల ఆదాయం పొందుతోంది. గత ఏడాది ఈ మొత్తం 256 రూపాయలుగా ఉంది. అంటే మిట్టల్ ప్రతిపాదిస్తున్న 350 రూపాయల లక్ష్యం ప్రస్తుతం ఎయిర్‌టెల్ సాధిస్తున్న 271 రూపాయల సగటు ఆదాయం కంటే దాదాపు 29 శాతం ఎక్కువ. దేశంలో చివరిసారిగా ప్రధాన టెలికాం కంపెనీలు 2024 జూన్‌లో మొబైల్ టారిఫ్‌లను సుమారు 10 నుంచి 25 శాతం వరకు పెంచాయి.

సునీల్ భారతీ మిట్టల్ చెబుతున్న ప్రకారం.. చైనాలో 10 లక్షలకు పైగా మొబైల్ టవర్లు ఉండగా, భారతదేశంలో సుమారు 3.5 లక్షల టవర్లు మాత్రమే ఉన్నాయి. భారతదేశంలో కూడా టవర్ల సంఖ్యను కనీసం రెట్టింపు చేయాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. 5G సేవల కోసం టెలికాం కంపెనీలు భారీగా పెట్టుబడులు పెట్టాయని, స్పెక్ట్రమ్ కొనుగోలుకే లక్షల కోట్ల రూపాయలు ఖర్చయ్యాయని, నెట్‌వర్క్ నిర్మాణానికి కూడా భారీ మొత్తాలు వెచ్చించాల్సి వచ్చిందని మిట్టల్ చెప్పారు. అయితే 5G ద్వారా ఆశించిన స్థాయిలో అదనపు ఆదాయం రావడం లేదని, ఈ విషయంలో టెలికాం పరిశ్రమ కొంత నిరాశకు గురైందని ఆయన వ్యాఖ్యానించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 14.11.2026
www.mudranews.in | @mudranews

జీర్ణక్రియకు మేలు!

చింతచిగురులోని పీచు పదార్థం జీర్ణక్రియకు తోడ్పడుతుంది. మలబద్ధకం సమస్యను తగ్గించడంలో కూడా ఫైబర్ ఉపయోగపడుతుంది.



ఒడిశా నుంచి మహారాష్ట్రకు
గంజాయి అక్రమ రవాణా

సూర్యాపేట పోలీసుల చాకచక్యంతో ముఠా గుట్టురట్టు
112 కిలోల గంజాయి స్వాధీనం.. ఇద్దరు నిందితుల అరెస్టు
25 లక్షల విలువైన గంజాయి పట్టివేత.. మరో ముగ్గురి కోసం గాలింపు



ముద్ర, సూర్యాపేట, నవంబర్ 13: ఒడిశా నుంచి మహారాష్ట్రకు గంజాయిని అక్రమంగా తరలిస్తున్న ముఠా గుట్టును సూర్యాపేట పోలీసులు రట్టు చేశారు. పక్కా సమాచారంతో చేపట్టిన దర్యాప్తులో 112 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ.25 లక్షలు ఉంటుందని జిల్లా ఎస్పీ కె. నరసింహ ఐపీఎస్ వెల్లడించారు. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు.శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ కేసు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన ఐదుగురు వ్యక్తులు సులభంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో గంజాయి అక్రమ రవాణాకు పథకం రూపొందించినట్లు తెలిపారు. ఒక్కొక్కరు రూ.50 వేల చొప్పున పెట్టుబడి పెట్టి ఒడిశాలోని జగన్నాథపురి ప్రాంతానికి వెళ్లి గుర్తుతెలియని వ్యక్తుల నుంచి కిలో రూ.2 వేల చొప్పున 112 కిలోల గంజాయిని మొత్తం రూ.2.24 లక్షలకు కొనుగోలు చేశారు.అనంతరం గంజాయిని 41 ప్యాకెట్లుగా తయారు చేసి ఇన్నోవా కారులో నింపి మహారాష్ట్రకు తరలించేందుకు బయలుదేరారు. పోలీసుల తనిఖీల నుంచి తప్పించుకునేందుకు మరో ఎర్టిగా కారును ఎస్కార్ట్‌గా ముందు నడిపించారు. పోలీసుల కదలికలను గమనిస్తూ వెనుక వస్తున్న ఇన్నోవా వాహనానికి సమాచారం చేరవేస్తూ ప్రయాణించారు.ఈ క్రమంలో నవంబర్ 7న సూర్యాపేట పట్టణ శివారులోని జాతీయ రహదారి-65పై పద్మావతి ఫంక్షన్ హాల్ సమీపంలో ఇన్నోవా కారు బ్రేక్‌డౌన్ అయింది. దీంతో నిందితులు వాహనాన్ని రహదారి పక్కన వదిలేసి అక్కడి నుంచి పరారయ్యారు. అనుమానాస్పదంగా కారు నిలిపి ఉన్నట్లు సమాచారం అందడంతో సూర్యాపేట రెండో పట్టణ పోలీస్ స్టేషన్ ఎస్సైలు కె.గోపికృష్ణ, బి. రామచంద్రం సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. వాహనాన్ని తనిఖీ చేయగా 41 ప్యాకెట్లలో 112 కిలోల గంజాయి గుర్తించారు. వెంటనే పంచుల సమక్షంలో గంజాయితో పాటు ఇన్నోవా కారును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.కేసు దర్యాప్తులో భాగంగా వదిలేసిన వాహనాన్ని తిరిగి తీసుకెళ్లేందుకు నవంబర్ 12న సూర్యాపేటకు వచ్చిన ఇద్దరు నిందితులను పోలీసులు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వీరు గంజాయి అక్రమ రవాణాలో భాగస్వాములుగా ఉన్నట్లు వెల్లడైంది.అరెస్టయిన నిందితులు వీరే..ఆకాష్ విజయ్ దాబేకర్ (23), బీడ్ జిల్లా, మహారాష్ట్ర.ఆకాష్ దిలీప్ మోరే (32), బుల్దానా జిల్లా, మహారాష్ట్ర.నిందితుల నుంచి మూడు సెల్‌ఫోన్లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరినీ అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో పరారీలో ఉన్న మరో ముగ్గురి కోసం ప్రత్యేక పోలీసు బృందాలతో గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు.మాదకద్రవ్యాలపై ఉక్కుపాదంగంజాయి అక్రమ రవాణా, విక్రయాలు, కొనుగోళ్లు, వినియోగంపై జిల్లా పోలీసులు నిరంతరం నిఘా కొనసాగిస్తున్నారని ఎస్పీ కె. నరసింహ తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం యువత ఆరోగ్యంతో పాటు కుటుంబాలను, భవిష్యత్తును తీవ్రంగా దెబ్బతీస్తుందని పేర్కొన్నారు. గంజాయి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.జిల్లాలో ఎక్కడైనా గంజాయి అక్రమ రవాణా లేదా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాచారం అందించిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు.పోలీసు సిబ్బందికి ఎస్పీ అభినందనలుఈ కేసును ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, సూర్యాపేట రెండో పట్టణ ఎస్సైలు కె. గోపికృష్ణ, బి. రామచంద్రం, హెడ్ కానిస్టేబుల్ శ్రీరాములు, కానిస్టేబుళ్లు కొండా రమేష్, ఎన్. నవీన్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సమావేశంలో కోదాడ డీఎస్పీ శ్రీనివాస్ రెడ్డి, సీఐ వెంకటయ్య, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : నేటి నుంచి 20 వరకు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో 59వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం.డి. అవేస్ రహమాన్ చిస్తీ, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎస్. వంశీకృష్ణ శుక్రవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాఠకులు, సాహితీవేత్తలు, ప్రజలందరూ పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

నల్గొండ రైతు బహిరంగ సభ గోడపత్రిక విడుదల



ముద్ర, బీబీనగర్ :ఈ నెల 15 నుండి 18 వరకు నల్లగొండలో జరిగే అఖిలభారత 36వ మహాసభల బహిరంగ సభకు లక్షలాదిగా తరలి రావాలని సిపిఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు కోమటిరెడ్డి చంద్రారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం బీబీనగర్ పట్టణ కేంద్రంలో సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో మహాసభల గోడపత్రిక విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ మండల కార్యదర్శి బండారు శ్రావణ్ కుమార్, మండల కమిటీ సభ్యులు పొట్ట యాదమ్మ, పట్టణ కార్యదర్శి బండారు శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గాడి శ్రీనివాస్, ఆడపల్లి జంగయ్య, తోకల రఘుపతి, పొట్ట వెంకటేష్, మేడబోయిన రాజు, బండారు బాలకృష్ణ లింగాల పోచయ్య, ఒంటెద్దు పాండు, నీరుడు నరసింహ, మహేష్ పాల్గొన్నారు.

పంటల మార్పిడిపై ప్రత్యేక కార్యాచరణ

ప్రతి క్లస్టర్‌కు సమగ్ర ప్రణాళిక..
రైతుల వద్దకే వెళ్లి అవగాహన కల్పించాలి
పంటల విజయగాథలతో ప్రత్యేక యూట్యూబ్ ఛానల్
నెల రోజుల పాటు ప్రచారం



ముద్ర, సూర్యాపేట, నవంబర్ 13:వ్యవసాయ రంగంలో పంటల మార్పిడిని ప్రోత్సహించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. ప్రతి వ్యవసాయ విస్తరణ అధికారి (ఏఈఓ) క్లస్టర్ పరిధిలో సాగుకు అనువైన పంటలు, ప్రోత్సహించాల్సిన రకాలు, సాగునీటి వనరులు, పెట్టుబడి వ్యయం, మార్కెటింగ్ అవకాశాలను పరిగణనలోకి తీసుకొని ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. ఇప్పటికే రూపొందించిన క్లస్టర్ వారీ పంటల వైవిధ్యీకరణ నివేదిక ఆధారంగా మండల, జిల్లా స్థాయి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. లక్ష ఎకరాల్లో పంటల మార్పిడి లక్ష్యంగా ప్రణాళిక రూపొందించినా అభ్యంతరం లేదని పేర్కొన్నారు.వ్యవసాయ, ఉద్యానవన శాఖలు సమన్వయంతో పనిచేయాలని, విబీజీ రాంజీ పథకం, సూక్ష్మ సేద్య పథకాలను పంటల మార్పిడితో అనుసంధానం చేయాలని సూచించారు. ప్రాంతాల వారీగా అనువైన పంటలను గుర్తించి రైతులను ఎంపిక చేయాలన్నారు. ఏ పంటకు ఎంత పెట్టుబడి అవసరం, ఎంత ఆదాయం వచ్చే అవకాశం ఉందనే వివరాలతో పంటల సూచిక జాబితా, రైతులకు పంపిణీ చేసేందుకు ప్రత్యేక హ్యాండ్‌బుక్ రూపొందించాలని ఆదేశించారు.రైతుల పద్దకే వెళ్లి ప్రచారం చేయాలియాసంగి 2026-27 వ్యవసాయ సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని పంటల మార్పిడిపై ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్లాలని కలెక్టర్ సూచించారు. కేవలం వాట్సాప్ గ్రూపుల్లో సమాచారం పంపడం, సమావేశాలు నిర్వహించడం మాత్రమే సరిపోదని, ప్రతి అధికారి నేరుగా రైతుల వద్దకు వెళ్లి అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. గతంలో ప్రతి అధికారి కనీసం పది మంది రైతులను కలవాలని సూచించిన విషయాన్ని గుర్తుచేశారు.ఈసారి రైతుల ఎంపిక, క్షేత్రస్థాయి పర్యటనలు, మండల ప్రత్యేక అధికారుల పర్యవేక్షణతో ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పంటల మార్పిడిపై నెల రోజుల పాటు ప్రత్యేక ప్రచార కార్యక్రమం చేపట్టాలని, పత్రికలు, ప్రసార మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని చెప్పారు. వ్యవసాయ, ఉద్యానవన, విబీజీ రాంజీ విభాగాల నుంచి ముగ్గురు, నలుగురు సభ్యులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. డీపీఆర్ విభాగం సహకారంతో ప్రచార సామగ్రి, వీడియోలు రూపొందించాలని ఆదేశించారు.ప్రతి క్లస్టర్ నుంచి రైతుల విజయగాథలుప్రతి ఏఈఓ క్లస్టర్ పరిధిలో ఇద్దరు నుంచి ఐదుగురు వరకు విజయవంతమైన రైతులను గుర్తించి వారి వివరాలు సేకరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకోసం గూగుల్ షీట్, గూగుల్ ఫారం రూపొందించి అదే రోజు సాయంత్రంలోగా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. రైతులు అనుసరిస్తున్న సాగు విధానం, పెట్టుబడి, దిగుబడి, ఆదాయం, సాధించిన విజయాలను నమోదు చేయాలని సూచించారు.రైతుల విజయగాథలను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రత్యేక యూట్యూబ్ ఛానల్ ఏర్పాటు చేయాలని చెప్పారు. ఏఈఓలు, వ్యవసాయ అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సేకరించిన వీడియోలను నాణ్యతతో రూపొందించి ఛానల్‌లో పోస్టు చేయాలన్నారు. వాట్సాప్ ద్వారా కూడా వీడియోలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్న సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి మూడు, నాలుగు రోజుల్లో యూట్యూబ్ ఛానల్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు.విద్యాశాఖపై సమగ్ర సమీక్షవిద్యాశాఖకు సంబంధించిన అన్ని అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రాథమిక, ఉన్నత, ఇంటర్మీడియట్, కళాశాల, పాలిటెక్నిక్ విద్యతో పాటు ప్రభుత్వ వైద్య కళాశాల వంటి విద్యాసంస్థల పనితీరును కూడా సమీక్షలో చేర్చాలని సూచించారు. వచ్చే మంగళవారం మధ్యాహ్నం ప్రత్యేక సమావేశం నిర్వహించి మొదటి రెండు గంటలు పాఠశాల విద్య, అనంతరం ఇంటర్మీడియట్, ఉన్నత విద్యాశాఖల అంశాలపై చర్చించాలని తెలిపారు.రెసిడెన్షియల్ పాఠశాలలు, హాస్టళ్లలో నాణ్యమైన విద్య అందించేందుకు గత సమీక్షలో సూచించిన కార్యక్రమాల అమలు, జారీ చేసిన సర్క్యులర్ల పురోగతిపై నివేదిక సమర్పించాలని ఆదేశించారు. ప్రతి జిల్లా శాఖాధికారి వారానికి ఒకసారి తన శాఖపై తప్పనిసరిగా సమీక్ష నిర్వహించాలని స్పష్టం చేశారు. సమీక్షలు కేవలం వాట్సాప్ సందేశాలకే పరిమితం కాకుండా రాతపూర్వక సూచనలు, పురోగతి నివేదికల ఆధారంగా జరగాలని పేర్కొన్నారు.యూనిఫామ్‌ల పంపిణీలో లోపాలు ఉండకూడదువిద్యార్థులకు యూనిఫామ్‌లు, ఇతర సదుపాయాల సరఫరాపై సమగ్ర సమీక్ష నిర్వహించి తాజా వివరాలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. యూనిఫామ్‌ల సరఫరా, కుట్టు పనులు, విద్యార్థుల కొలతల్లో ఎలాంటి తేడాలు లేకుండా చూడాలన్నారు. చిన్న పిల్లలకు పెద్ద సైజు, పెద్ద పిల్లలకు చిన్న సైజు దుస్తులు అందితే ఇబ్బందులు ఎదురవుతాయని పేర్కొన్నారు.మండల విద్యాశాఖాధికారులు, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, బాధ్యతలను ఒకరిపై మరొకరు నెట్టకుండా సమస్యలను పరిష్కరించాలని సూచించారు. యూనిఫామ్‌ల సరఫరా, పంపిణీలో ఎదురవుతున్న సమస్యలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి సంబంధిత అధికారులతో సమీక్షించాలని ఆదేశించారు.పశుసంవర్ధక శాఖకు సూచనలుపశుసంవర్ధక శాఖకు సంబంధించి గతంలో ఇచ్చిన ఆదేశాలను తప్పనిసరిగా అమలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. యానిమల్ వెల్ఫేర్ కంట్రోల్ సెంటర్‌కు సంబంధించిన అంశాలకు ప్రాధాన్యతనిస్తూ, వాటి అమలుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బి. హరిసింగ్, డీఆర్వో ప్రేమ్ రాజు, డీఆర్డీవో పీడీ సన్యాసయ్య, సీఎఫ్ఓ దామోదర్ రెడ్డి, డీఏఓ యాదగిరి, డీఐఈఓ సులోచన రాణి, డీబీసీడీఓ విశాల్, డీఎస్డీఓ లతా, మిషన్ భగీరథ ఈఈ అరుణాకర్, ఇంట్రా ఈఈ శ్రీనివాసరావు, జీఎం ఇండస్ట్రీస్ భారతి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

19 నుంచి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలు

జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ఈ నెల 19వ తేదీ నుంచి జిల్లా లో ప్రారంభించనున్నట్లు జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి తెలిపారు. ఈ పథకం అమలుకు సంబంధించి శుక్రవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పలు సూచనలు చేశారని కలెక్టర్ పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రంలో జన్మించిన 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ పథకంలో బీమా వ్యక్తిగా నమోదు చేసుకునేందుకు అర్హులని తెలిపారు.ఈ నేపథ్యంలో యాదాద్రి భువనగిరి జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో ఈ నెల 19వ తేదీ నుంచి ప్రజలకు అందుబాటులో ఉండేలా ప్రత్యేక కేంద్రాలు, నమోదు క్యాంపులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పథకానికి సంబంధించిన దరఖాస్తు ఫారాలు, ప్రొఫార్మాలు, ఇతర అవసరమైన సమాచారాన్ని ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు.గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పథకంపై విస్తృతంగా ప్రచారం నిర్వహించి, అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకంపై అవగాహన కల్పించాలని తెలిపారు. దరఖాస్తుల స్వీకరణ, నమోదు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లాలోని అర్హులైన ప్రజలందరూ ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకొని, తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి కోరారు.

నిరుపేదలకు వరం ముఖ్యమంత్రి సహాయనిధి



ముద్ర, దేవరకొండ: నిరు పేదలకు వరం ముఖ్యమంత్రి సహాయ నిధి అని చిన్న అడిషర్లపల్లి గ్రామ సర్పంచ్ పందుల వెంకటయ్య గౌడ్ అన్నారు.ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ ఆదేశాల మేరకు కొండమల్లేపల్లి మండలం చిన్న అడిషర్లపల్లి గ్రామానికి చెందిన ఓంగూరి లక్ష్మయ్య కు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి రూ.1,64000 చెక్కును శుక్రవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో అంద జేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాపాలన ప్రభుత్వం బడుగు,బలహీన వర్గాల సంక్షేమం కోసం కృషి చేస్తుందని అన్నారు.నూతనంగా మంజూరు అయిన చేయూత పెన్షన్ల ను కూడా ప్రభుత్వం ఎలాంటి దళారుల చేతుల్లో కి వెళ్లకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు ఈ నెల 19 వ తేదీన మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ పుట్టిన రోజు సందర్భంగా జమ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గుండాల వెంకటయ్య, వార్డ్ సభ్యులు కూర దేవేందర్, ఇమ్మడి వెంకటమ్మ, అంజయ్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భువనగిరి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ముదిరాజులకివ్వాలి

ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : భువనగిరి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ముదిరాజ్ కులస్తులకు ఇవ్వాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి సాదు విజయ కుమార్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ముదిరాజ్ భువనగిరి పట్టణ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు.కాంగ్రెస్ ప్రభుత్వం ముదిరాజ్ కులస్తులకు పెద్దపీట వేస్తామని చెబుతూ ఎలాంటి పదవులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. భువనగిరి మార్కెట్ పరిధిలోని పోచంపల్లి బీబీనగర్, భువనగిరి మం డలం, పట్టణంలోముదిరాజ్ లు మత్స్యకారి వృత్తి తో పాటు వ్యవసాయ వృత్తిపై ఆధారపడి ఉన్నారన్నారు. ఇటీ వల ఖాళీ అయిన వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ముదిరాజ్ వారికి ఇవ్వాలని కోరారు. రాజకీయ రంగంలో ముదిరాజులకు సముచిత అవకాశాలు కల్పించాలని కోరారు. ముదిరాజ్ సంఘం భువనగిరి పట్టణ అధ్యక్షులు ఎనబోయిన జహంగీర్, ముదిరాజ్ పట్టణ ప్రధాన కార్యదర్శి నీల శ్రీనివాస్ ముదిరాజ్, సామల భాస్కర్, చాగంటి నరసింహ, పెంట వినయ్, మొలకల సత్యనారాయణ, పాల్గొన్నారు


శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారిని దర్శించుకున్న రాష్ట్ర సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్య రెడ్డి



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని తెలంగాణ రాష్ట్ర సమాచార కమిషనర్ శ్రీ బోరెడ్డి అయోధ్య రెడ్డి శుక్రవారం కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఆలయానికి విచ్చేసిన వారికి ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం గర్భాలయంలోని స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. దర్శనానంతరం వేదపండితులు వారికి వేదాశీర్వచనం అందజేయగా, ఆలయ అధికారులు స్వామి వారి శేషవస్త్రం, లడ్డు ప్రసాదం అందజేశారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
శనివారం 14.11.2026
www.mudranews.in | @mudranews

కిడ్నీలో రాళ్ల సమస్యకు చెక్!




చింతచిగురులో ఉండే కొన్ని సహజ సమ్మేళనాలు మూత్రపిండాల ఆరోగ్యానికి మేలు చేయవచ్చని చెబుతారు. అయితే కిడ్నీలో రాళ్లను కరిగిస్తుందని లేదా పిండిచేస్తుందని నిరూపితమైన ఆధారాలు లేవు.

మల్లన్న పాదయాత్రలో విషాదం

కాన్వాయ్‌పై దూసుకొచ్చిన లారీ.
రెండు కార్లు నుజ్జు నుజ్జు
భార్యాభర్తల పరిస్థితి విషమం..
రెండేళ్ల చిన్నారికి తీవ్ర గాయాలు
తృటిలో తప్పించుకున్న తీన్మార్ మల్లన్న..
ప్రమాదంపై అనుమానాలు











ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి : తీన్మార్ మల్లన్న పాదయాత్రలో ఒక్కసారిగా మృత్యువు లారీ రూపంలో దూసుకొచ్చింది. వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ మల్లన్న కాన్వాయ్‌లోని ఫార్చునర్ కారును బలంగా ఢీకొట్టడంతో రెండు కార్లు నుజ్జునుజ్జయ్యాయి. ఈ ఘోర ప్రమాదంలో భార్యాభర్తలు సహా నలుగురు గాయపడగా, రెండేళ్ల చిన్నారి కూడా తీవ్రంగా గాయపడటం కలకలం రేపింది. భార్యాభర్తల పరిస్థితి విషమంగా ఉన్నట్లు పోలీసుల సమాచారం. అయితే ప్రమాద సమయంలో కారులో కాకుండా కాలినడకన పాదయాత్ర చేస్తున్న తీన్మార్ మల్లన్న తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం అనాజిపురం గ్రామ సమీపంలోని గౌరెల్లి–కొత్తగూడెం ప్రధాన రహదారిపై శుక్రవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. మోత్కూరు నుంచి అనాజిపురం మీదుగా తిరుమలగిరి వైపు మల్లన్న పాదయాత్ర కొనసాగుతున్న సమయంలో చౌటుప్పల్ మండలం జైకేసారానికి చెందిన లారీ (టీఎస్ 30 టీ 7596) వెనుక నుంచి వేగంగా వచ్చి కాన్వాయ్‌లోని ఫార్చునర్ కారు (టీఎస్ 30 ఎల్ 444)ను బలంగా ఢీకొట్టింది. లారీ ఢీకొన్న ధాటికి ఫార్చునర్ కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న మరో కారును ఢీకొట్టింది. దీంతో రెండు వాహనాలు తీవ్రంగా ధ్వంసమయ్యాయి.ఈ ప్రమాదంలో టీఎస్ 04 8919 నంబర్ గల కారులో ప్రయాణిస్తున్న తిరుమలగిరికి చెందిన మేడబోయిన శ్రీనాథ్, ఆయన భార్య చందన, రెండేళ్ల కుమారుడితో పాటు డ్రైవర్ సురేష్ గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే 108 అంబులెన్స్ ద్వారా నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు. మల్లన్నకు చెందిన ఫార్చునర్ కారులో ఉన్న మరో ఇద్దరు కూడా గాయపడినట్లు సమాచారం.లారీ ఢీకొన్న తీవ్రతకు మల్లన్న ఫార్చునర్ కారు పూర్తిగా ధ్వంసమైంది. ప్రమాద సమయంలో మల్లన్న వాహనంలో లేకుండా ముందుగా కాలినడకన వెళ్తుండటంతో పెను ప్రమాదం నుంచి బయటపడ్డారు. పాదయాత్రలో పాల్గొంటున్న వారిపై ఒక్కసారిగా ప్రమాదం విరుచుకుపడటంతో అక్కడ తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి.కాగా, ఇది కేవలం రోడ్డు ప్రమాదమేనా? లేక మరేదైనా కారణం ఉందా? అన్న కోణంలో స్థానికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ప్రమాదానికి సంబంధించి ఎలాంటి కుట్ర కోణం ఇంకా నిర్ధారణ కాలేదు. ఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ప్రమాద తీరును పరిశీలించి, వాహనాల వివరాలు సేకరిస్తున్నారు. ప్రమాదానికి గల అసలు కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

అపరాజితకు లక్ష పుష్పార్చన



ముద్ర ప్రతినిధి, మెదక్: మెదక్ పట్టణం ఇందిరా కాలనీలోని శ్రీ అపరాజిత మాత దేవాలయంలో ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా మహిళలచే లక్ష పుష్పార్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు మిట్టపల్లి ప్రసాద్ పంతులు, రాజేశ్వర శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ధార్మిక సంస్థ సభ్యులు వీరమల్లి రమేష్, మ్యాడం వీరేందర్, గోలి కుమార్, ఉప్పల రవీందర్, చెన్న రామచందర్, కౌన్సిలర్ అరునారి వెంకట రమణ, తొడుపునూరి హరినాథ్, ఉప్పల అంజయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మకు పుష్పదీప నీరాజనం



ముద్ర ప్రతినిధి, మెదక్: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయలలో కార్తీక మాస ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం సాయంత్రం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం మండపంలో దీపాలు వెలిగించి, ఆకాశ దీపారాధన చేశారు. ఆలయ అర్చకులు పార్థివ శర్మ ప్రత్యేక అమ్మవారి పుష్పాలంకరణ ఆకట్టుకుంది. భక్తులు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని దీపాలు వెలిగించారు. దుర్గా, శివ కేశవ నామస్మరణ మారుమ్రోగింది.

వేస్లీ గోల్ బంగ్లాలో జిల్లా స్థాయి సైన్స్ ఫెయిర్

డిఈఓ రాజు

ముద్ర ప్రతినిధి, మెదక్: డిసెంబర్ మొదటి వారంలో స్థానిక వెస్లీ స్కూల్ నందు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్స్పైర్ ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు డిఈఓ రాజు తెలిపారు.అన్ని యాజమాన్యాల పాఠశాలలు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు. విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని, పరిశోధనా నైపుణ్యాలను పెంపొందించేందుకు జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన, ఇన్స్పైర్ పీఎంశ్రీ పాఠశాలల ప్రత్యేక ప్రదర్శనలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామన్నారు. ఈ ఏడాది వైజ్ఞానిక ప్రదర్శన అంశం "సుస్థిర మరియు వికసిత్ భారత్ కోసం సైన్స్, టెక్నాలజీ, ఇన్నోవేషన్" అనే ప్రధాన ఇతివృత్తంతో జరగనున్నాయన్నారు.ఈ జిల్లాస్థాయి సైన్స్ ఫెయిర్ పోటీలలో జిల్లాలోని అన్ని యాజమాన్యాల పాఠశాలలో 6 నుండి 10 వ తరగతి చదువుచున్న విద్యార్థులు పాల్గొనాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రతి పాఠశాల వినూత్న ప్రాజెక్ట్ లు ప్రదర్శించేలా ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకొని విద్యార్థులను సన్నద్ధం చేయాలని సూచించారు.విద్యార్థులు తమ వినూత్న శాస్త్రీయ ఆలోచనలను, పరిశోధనా ప్రాజెక్టులను 7 ఉప-అంశాల ఆధారంగా రూపొందించి



ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. 1. మెరుగైన దైనందిన జీవిత సమస్యలను పరిష్కరించడంలో ఏఐ సాంకేతికత పాత్ర.2. గ్రీన్ ఎనర్జీ, పర్యావరణ పరిరక్షణ పునరుత్పాదక ఇంధన వనరులు, కాలుష్య నియంత్రణ, పర్యావరణ రక్షణ మార్గాలు.3. మ్యాథమెటికల్ మోడలింగ్, కంప్యూటేషనల్ థింకింగ్ గణిత నమూనాలు. 4. ఆరోగ్యం, పరిశుభ్రత, పారిశుధ్యం ప్రజారోగ్యం.5. దేశీయ వ్యవసాయ పద్ధతులు మన సాంప్రదాయ, సేంద్రీయ, సుస్థిర వ్యవసాయ విధానాల విశిష్టత.6. గ్రామీణ పరివర్తన కోసం సైన్స్ 7. విపత్తు నిర్వహణ ప్రకృతి వైపరీత్యాలను ముందస్తుగా గుర్తించడం, ఎదుర్కొనే ప్రణాళికలు, రక్షణ చర్యలు.జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన. గత ఏడాది ఇన్స్పైర్ అవార్డ్స్ ప్రదర్శనగత ఏడాది జిల్లా మొత్తంలో ఇన్స్పైర్ అవార్డుకు ఎంపికైన 49 ప్రాజెక్టుల విద్యార్థులు, గైడ్ ఉపాధ్యాయులు ఈ అవకాశాన్ని తప్పక సద్వినియోగం చేసుకోవాలని డిఈఓ రాజు సూచించారు. సదరు ప్రాజెక్టులను మరింత మెరుగ్గా సిద్ధం చేయడానికి అవసరమైన నగదు ఇప్పటికే ఆయా విద్యార్థుల ఖాతాల్లో జమ చేయబడింది. కావున, ఎంపికైన ఆ 49 ప్రాజెక్టులను కూడా ఈ జిల్లాస్థాయి ప్రదర్శనలోనే తప్పనిసరిగా ప్రదర్శించాల్సి ఉంటుందన్నారు. పీఎంశ్రీ పాఠశాలలకు ప్రత్యేక గ్యాలరీఈ సంవత్సరం నుండి కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక పీఎంశ్రీ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఒక గ్యాలరీని ఏర్పాటు చేయనున్నారు. ఆయా పాఠశాలలకు చెందిన విద్యార్థులు తాము రూపొందించిన అత్యాధునిక, సృజనాత్మక ప్రాజెక్టులను ఈ ప్రత్యేక గ్యాలరీలో ప్రదర్శించాల్సి ఉంటుందని డిఈఓ తెలిపారు. అన్ని యాజమాన్యం పాఠశాలకు, ఉపాధ్యాయులు మూడు ప్రదర్శనల ప్రాజెక్టులను జిల్లాస్థాయి ప్రదర్శనకు సిద్ధం చేయాలని వివరించారు. సందేహాలకు జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డిని 8328599157 సంప్రదించాలన్నారు.

అప్రమత్తతతో ప్రాణాలు కాపాడిన పోలీస్ బ్లూ కోట్ సిబ్బంది

రమేష్, హోంగార్డు మైసయ్యను అభినందించిన ఎస్పీ

ముద్ర ప్రతినిధి, మెదక్: కుటుంబ కలహాలతో ఊరేసుకుని ఆత్మహత్య చేసుకోబోయిన వ్యక్తిని సకాలంలో స్పందించిన పోలీసులు కాపాడారు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండల కేంద్రంలో సంతోష్ అనే వ్యక్తి ఇంట్లో తలుపులు వేసుకొని ఉరివేసుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. ఈ ఘటనపై డయల్ 112కు సమాచారం అందడంతో వెంటనే స్పందించిన బ్లూ కోట్ సిబ్బంది రమేష్, హోంగార్డు మైసయ్య హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకున్నారు.ఇంట్లో ఉరివేసుకున్న స్థితిలో ఉన్న సంతోష్‌ను గమనించిన సిబ్బంది తక్షణమే అప్రమత్తమై, సమయస్ఫూర్తితో చీరను కత్తిరించి అతడిని కిందకు దించి



రక్షించారు. అనంతరం అవసరమైన వైద్య సహాయం అందించేలా చర్యలు చేపట్టారు.సకాలంలో స్పందించి ఒక ప్రాణాన్ని కాపాడిన సిబ్బంది రమేష్, హోంగార్డు మైసయ్యల సమయస్ఫూర్తి, సేవలను అక్కడి ప్రజలు అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు. ఎస్పీ డీవీ శ్రీనివాస్ రావు అభినందించారు.

మరమ్మతులకు రూ.3.32 కోట్లు మంజూరు

ఎమ్మెల్యే డా.రోహిత్



ముద్ర ప్రతినిధి, మెదక్: వర్షాల వల్ల దెబ్బతిన్న హవేలిఘనపూర్, రాయన్‌పల్లి ప్రాజెక్టు, చెరువుల మరమ్మతుల కోసం రూ.332.90 లక్షల నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్లు ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ తెలిపారు. మెదక్ నియోజకవర్గంలో 2025 ఆగస్టు నెలలో కురిసిన భారీ వర్షాలకు దెబ్బతిన్న హవేలిఘనపూర్ మండలంలోని పెద్ద చెరువు, మెదక్ మండలం రాయన్‌పల్లి చెరువు మరమ్మతుల కోసం మొత్తం రూ.332.90 లక్షలు (రూ.3 కోట్ల 32 లక్షల 90 వేల రూపాయలు) మంజూరయ్యాయి. మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు ప్రత్యేక చొరవ, కృషి ఫలితంగా ఈ నిధులు మంజూరయ్యాయి. హవేలిఘనపూర్ పెద్ద చెరువుకు రూ.108.10 లక్షలు, రాయన్‌పల్లి చెరువుకు రూ.224.80 లక్షలు మంజూరు అయ్యాయి.

శివ, అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాద వితరణ



ముద్ర ప్రతినిధి, యాదాద్రి భువనగిరి :శ్రీ పచ్చల కట్ట సోమేశ్వర స్వామి ఆలయంలో దాతలు 17వ వార్డు కౌన్సిలర్ చెన్న స్వాతి మహేష్ గురు స్వామి, ఆలయ కమిటీ చైర్మన్ కొల్లూరి రాజు, ఆలయ ప్రధాన అర్చకులు కప్పగంతుల నాగరాజు శర్మ ఆధ్వర్యంలో కార్తీకమాసం 30 రోజులు శివ దీక్ష స్వాములకు, అయ్యప్ప దీక్ష స్వాములకు ప్రతిరోజు అన్న ప్రసాద వితరణ నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల నుండి, మూడు గంటల 30 నిమిషాల వరకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమం అంగరంగ వైభవంగా 300 మంది స్వాములకు పెద్ద ఎత్తున నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సేవకులుగా దర్గాయి దేవేందర్, బాలరాజు, మాయ ప్రభుదేవ్, సాయికుమార్, బాలరాజు పాల్గొన్నారు.

నీటి లభ్యత మేరకు రబీ పంటలు

వీడియో కాన్ఫరెన్స్‌లో సి ఎస్ ఆదేశం



ముద్ర ప్రతినిధి, మెదక్: రబీ 2సీజన్‌లో నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల సాగు ప్రణాళిక రూపొందించాలని, రైతులను ప్రత్యామ్నాయ పంటల సాగు వైపు ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు.ప్రాజెక్టుల్లో నీటి లభ్యత లేని పరిస్థితుల నేపథ్యంలో వరి సాగును నివారించి ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్, సూక్ష్మ సేద్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. శుక్రవారం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో వ్యవసాయ కార్యాచరణ ప్రణాళిక, విద్యాశాఖ, భూసేకరణ, వీధి కుక్కల నియంత్రణ, విబిజిరాంజి పనుల పురోగతిపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ పలు అంశాలను సమీక్షించారు. మెదక్ కలెక్టరేట్ నుండి అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, జిల్లా అటవీ శాఖ అధికారి జోజి, ఉద్యానవన శాఖ అధికారి ప్రతాప్ సింగ్, డీఈఓ రాజు తదితరులు పాల్గొన్నారు.కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని, ప్రత్యామ్నాయ పంటల సాగుతో కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలు, ఇతర పథకాలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.

Printed, Published and owned by Aliminati Indra Reddy Printed at M/s. Kakatiya Printers, 2-24-96/6, Plot No. 26 & 27, L.N. Colony, New IDA, Uppal, Hyderabad500039, Medchal Malkajgiri Dist., Telangana and Published from H. No. 7-32/B, Flat No. 202, Sri Sai Heights, Sri Sai Nagar, Street No. 8, Hasbiguda, Medchal Malkajgiri District, Hyderabad 500007, Editor: Y Narender Reddy, RNI. Reg. No. TELTEL/2013/50413. e mail: mudradaily@gmail.com, Cell 9949193555